RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 28 ISSUE NO : 28 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | మంగళవారం, జులై 15, 2025 Tuesday, July,15, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-

## అటు సూర్యుడు ఇటు పొడిచినా

# బిసిలకు 42% రిజర్వేషన్లు

- త్వరలోనే స్థానిక ఎన్నికలు బలహీనవర్గాలకు అధికారం అప్పగించడమే మా లక్ష్యం
- లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయింది ప్రాజెక్టులపై నాగార్జునసాగర్

- సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**సూర్యాపేట,జూలై,14,తెలంగాణ దిశ:** స్థానిక' ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా, తుంగ తుర్తి నియోజకవర్గం, తిరుమలగిరి పట్టణంలో సోమ వారం నిర్వహించి న కార్యక్రమంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పం పిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ .. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయం అందిం చనున్నామని అన్నారు. అ టు సూర్యుడు ఇటు పొడిచినా బిసిలకు స్థానిక సంస్థల ఎ న్నికల్లో రిజర్వేషన్ కల్పించి తీరుతామని మరోమారు స్పష్టం చేశారు. నల్లగొండ ప్రజలకు, తెలంగాణ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన పథకాల ప్రాధాన్యతను వివరించారు. నల్లగొండ ఉమ్మడి జిల్లా పోరాటాల చరిత్ర గలదని, పౌరుషాలు చూపిన నాయకులు, ప్రజలు ఈ నేలకే చెందారని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి ప్రే రణ కలిగించిన జిల్లాల్లో నల్లగొండే ప్రధాన స్థానమని అ న్నారు. లక్ష కోట్ల రూపాయలతో చేపట్టిటన కాళేశ్వరం మూడేళ్లలో కూళేశ్వరం అయిందని, కానీ 70 ఏళ్ల కిం దట కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు ఇప్పటికీ నిలకడగా సాగుతున్నాయని వ్యాఖ్యానించారు. మేడిగడ్డ, సుందిళ్ల వంటి అనేక ప్రాజెక్టులు నిలబడలేకపోయాయని, బిఆర్ఎస్ నేతలను సుందిళ్ల కాడ ఉరేస్తే తప్పేమీ లేదని అన్నారు. ఇప్పటికీ నల్లగొండ జిల్లాకు నీరు అందుతోందం టే అది కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల వల్లే అని అన్నారు. మాజీ సిఎం కెసిఆర్ నేతృత్వంలోని బిఆర్ ఎస్ పాలనపై తీవ్ర విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డి.. పదేళ్ల లో ఒక్క రేషన్ కార్డు ఇచ్చారా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం ఇవ్వడాన్ని కూడా ఆ నేతలు ఓర్చుకోలేకపోతున్నారని మండిపడ్డారు. నేడు రేషన్ కార్డు లేని వారికి అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం 5 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇస్తుందని అన్నారు. ప్రజలు మాయలో పడరని, వారికి నిజమైన సంక్షేమమే ముఖ్యమని అన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి చూపిం చామని, ఈ విషయంలో ప్రచారం చేయకూడదనే ప్రయ త్నం జరుగుతోందని తెలిపారు. విషయంలో విమర్శలు చేసినవారు తప్పుచేశారని, కానీ కేవలం 9 రోజుల్లోనే 1.48 కోట్ల ఎకరాలకు రూ.9 వేల కోట్ల రైతు భరోసా మంజూరు చేశామని ధీమా వ్యక్తం చేశారు.

## రేపు తెలుగు రాష్ట్రాల సిఎంల భేటీ



**న్యూఢిల్లీ,జూలై,14:**తెలుగు రాష్ట్రాల జల వివాదాలపై కేంద్ర ప్రభుత్వం ఈనెల 16వ తేదీ న ఇరు రాష్ట్రాల సిఎంలతో సమావేశాన్ని ఏర్పాటుచేసింది. కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగే ఈ సమావేశానికి తె లంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, ఎపి సిఎం చంద్రబాబునాయుడులను ఆహ్వానిస్తూ సోమవారం జలశక్తి శాఖ సర్క్యుల్ జారీచేసింది. తెలు గు రాష్ట్రాల ముఖ్యమంత్రుల స మావేశం న్యూ ఢిల్లీ లో 16వ తేదీన మధ్యాహ్నం 2:30 గంటలకు జరుగనున్నది. ఇదిలా ఉ ండగా, కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ వాటాలను సాధించేందుకు కేం ద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సి ఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. కృ ష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ కు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని, న్యా యపరంగా రావాల్సిన నీటి వా టాల సాధనకు కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. మధ్యాహ్నం ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లి బుధ, గురురవారాలు(జులై 16, 17 తేదీలు) అక్కడే ఉంటారని సమాచారం. బిసి రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలవడంతో పాటు పార్టీ అధిష్ఠానంతో భేటీకానున్నట్టు తెలిసింది.

## మల్లన్న గన్‌మన్ల తీరుపై సిపి సీరియస్



**హైదరాబాద్,జూలై,14,తెలంగాణ దిశ:** తీ న్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కా ర్యాలయంపై దాడి కేసులో గన్‌మెన్ల వ్యవహార తీరుపై రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బా బు సీరియస్‌గా పరిగణించారు. ఎమ్మెల్సీ చింతపండు నవీన్ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ఆగ్రహం వ్యక్తం చే సిన జాగృతి కార్యకర్తలు ఆదివారం ఫిర్జాదీగూడలోని తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి చే శారు. ఈ సమయంలో జాగృతి కార్యకర్తలు మల్లన్నపై దాడి చేసేందుకు ప్రయత్నించడంతో గన్‌మెన్లు ఆరు రౌండ్లు కాల్పులు జరిపారు. కా ల్పుల్లో జాగృతి చెప్పడంతో ముందు జాగ్రత్తగా కాల్పులు జరిపామని చెప్పడంపై రాచకొం డ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు సీరియస్‌గా పరిగణించారు. గన్‌మెన్లు గాలిలోకి కాల్పులు జరిపి తర్వాత నేరుగా అక్కడికి వచ్చిన వారిపై కాల్పులు జరపడంపై సీరియస్ అయ్యారు. వెంటనే ఇద్దరు గన్‌మెన్లను రాచకొండ కమిషనర్ కార్యాలయానికి అటాచ్ చేశారు. తీన్మార్ మల్లన్న ఫిర్యాదు మేరకు జాగృతి కార్యకర్తలపై బిఎన్ఎస్ 191(2), 191(3), 333, 109, 324(4), 351(3), 132, రెడ్‌విత్ 190, 49 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తీన్మార్ మల్లన్న ఆయన కార్యాల సిబ్బంది కత్తులతో దాడ చేశారని జాగృతి కార్యకర్త అశోక్ యాదవ్ ఫిర్యాదు చేశారు. తీన్మార్ మల్లన్న, ఆయన సిబ్బందిపై పోలీసులు 191(2), 191(3), 76,127(2), 109,351(3), రెడ్‌విత్ బిఎన్ఎస్ 190 కింద కేసు నమోదు చేశారు.

## కలకలం సృష్టిస్తున్న చేతబడి హత్యలు..




**హైదరాబాద్,జూలై,14,తెలంగాణ దిశ:** ఉమ్మడి మెదక్ జిల్లాలో చేతబడి పేరుతో హత్యలు కలకలం సృష్టిస్తున్నాయి. చేతబడులు చేస్తున్నారన్న అనుమానంతో తోడబుట్టిన వాళ్ళను హత్య చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మూడు రోజుల వ్యవధిలో రెండు దారుణ ఘటనలు చోటు చేసుకున్నాయి. సాంకేతిక యుగంలోనూ మూఢ నమ్మకాలను బలంగా నమ్ముతున్నారు జనం. ఏదైనా రోగం వస్తే మంత్రాలతోనే వచ్చిందని నమ్ముతున్నారు. ఈ నెల11న మెదక్ జిల్లా కొల్చారం మండలం వస్రాం తండాలో తన కుటుంబానికి చేతబడి చేశాడని.. మంక్యా నాయక్‌ని తమ్ముడు మోహన్ అతి కిరాతకంగా బాండ రాళ్లతో మోది.. కల్లు సీసాలతో పొడిచి హత్య చేశాడు. నిన్న సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో చేతబడులు చేస్తున్నాడని తాజుద్దీన్ అనే యువకుని హసన్ అనే వ్యక్తి దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని బావిలో పడేశాడు. మానవ సంబంధాలు మంటగలుస్తున్నాయి.

## కాంగ్రెస్ అంటేనే

# వ్యవసాయం, కరెంట్, ప్రాజెక్టులు

### కేసీఆర్ చేసిన తప్పులను మాపై రుద్దుతున్నారు.. మల్లు భట్టి విక్రమార్క ఫైర్

**ఖమ్మం,జూలై,14,తెలంగాణ దిశ:** తమ ప్రభుత్వంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి కాపాడుకుంటామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, రైతులకు అండగా నిలిచిందని నొక్కి చెప్పారు. సోమవారంకూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ నీటిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విడుదల చేశారు. జిల్లాలో 2.50లక్షల ఎకరాలకు పాలేరు రిజర్వాయర్ నుంచి 1500 క్యూసెక్కుల సాగు నీటిని రెండో జోనుకు మంత్రులు విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఇవాళ సాగర్ రెండో జోన్‌కు సాగునీరు విడుదల చేశామని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం, కరెంట్, ప్రాజెక్టులు అని అభివర్ణించారు. గత కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాలు తెలంగాణ రాష్ట్రానికి భారంగా మారాయని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో చేసిన తప్పిదాలకు నేడు తమ ప్రభుత్వం మూల్యం చెల్లిస్తోందని అన్నారు. గతంలో శ్రీశైలంపైన ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే అడ్డుకోకుండా కేసీఆర్ ప్రభుత్వం సహకరించిందని మండిపడ్డారు. ఆనాడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రాజెక్టుల నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశామని గుర్తుచేశారు. ఆనాడు కేసీఆర్, హరీష్‌రావు, కేటీఆర్ తప్పులు చేసి వాటిని ఇప్పుడు తమపై రుద్దాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. రైతులు పండించిన పంటకు పెట్టుబడిగా రైతు భరోసా, రూ.9 వేల కోట్లు ఇచ్చామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో సన్నవడ్లకు బోనస్ ఇచ్చామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. 2,55,324 లక్షల ఎకరాలకు సాగునీటిని విడుదల చేశామని తెలిపారు. గత ఏడాది కనీవినీ ఎరుగని



వరదల కారణంగా సాగర్ మెయిన్ కెనాల్ పూర్తిగా కొట్టుకుపోయిందని.. దానిని పునరుద్ధరించామని తెలిపారు. నాగార్జున సాగర్ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కృష్ణా బేసిన్‌లో వచ్చే నీటితో మొదటి పంటకు ఎలాంటి ధోకా లేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వరుణ దేవుడి అండ ఉందని.. ఇది శుభసూచకమని అన్నారు.

## జోరుగా వానలు.. సమృద్ధిగా పంటలు ..

### స్వర్ణలత భవిష్యవాణి



**సికింద్రాబాద్ ,తెలంగాణ దిశ:** ఈ ఏడు వర్షాలు తప్పకుండా కురుస్తాయని పంటలు సమృద్ధిగా పండుతా యని మాతంగి స్వర్ణలత భవిష్యవాణి చెప్పారు. సికిం ద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు వేడుకల్లో భాగంగా రంగం, భవిష్యవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. పచ్చికుండపై నిలబడి అమ్మవారు పూనిన మాతంగి స్వర్ణలత భవిష్యవాణి చెప్పారు. ఉజ్జయినీ మహంకాళిబోనాల ఉత్సవంతో సంతృప్తి చెందావా.. అని అర్చకులు ఆమెను ప్రశ్నించారు. అందుకు మాతంగి స్వర్ణలత సమాధానం చెబుతూ.. ప్రజలంతా డప్పుచప్పుళ్లతో ఆనందోత్సాహాల నడుమ తనకు బోనాలు సమర్పించారని తెలిపారు. వచ్చిన ప్రతి బోనాన్ని తాను సంతోషంగా అందుకున్నానని పలికింది. కానీ, ప్రతి ఏటా ఉత్సవానికి ఏదో ఒక ఆటంకం కల్పిస్తున్నారని.. తనను ఎవరూ లెక్కచేయడం లేదని అమ్మవారు చెప్పింది. తల్లిదండ్రులు వాళ్ల పిల్లలను విచ్చలవిడిగా వదిలేస్తున్నారని.. ప్రజలందరినీ తన కన్నబిడ్డల్లా చూసుకుంటూ కాపాడుకుంటున్నానని పలికింది.

## కేసీఆర్‌తో హరీష్‌రావు కేటీఆర్ కీలక భేటీ..



**హైదరాబాద్,జూలై,14,తెలంగాణ దిశ:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకంట్ల చంద్రశేఖర్‌రావుని నందినగర్ నివాసంలో మాజీ మంత్రులు కేటీఆర్ , హరీష్‌రావు సోమవారంభేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. తాజా రాజకీయ పరిణామాలపై కేసీఆర్‌తో కేటీఆర్, హరీష్‌రావు చర్చించారు. ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు,ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా..ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, కల్వకుంట్ల కవిత మధ్య రాజకీయంగా వైరం నడుస్తోంది. సంగారెడ్డిలో జరిగిన బీసీల ఆత్మీయ సమావేశంలో ఇటీవల మల్లన్న పాల్గొన్నారు. ఆ సభలో కవితపై మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేశారు. బీసీలతో కవితకి ఏం సబంధమని ప్రశ్నించారు. బీసీల రిజర్వేషన్‌లపై రేవంత్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువస్తే కవిత సంబురాలు ఎందుకు చేసుకుంటుందని నిలదీశారు.

## కాంగ్రెస్ కుట్రలు చేధిస్తాం..

# రైతన్నల కోసం పోరాడుతాం

### కాంగ్రెస్ ప్రభుత్వంపైకేటీఆర్ ఫైర్

హైదరాబాద్, జులై 14: కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి ఫైర్ అయ్యారు మాజీ మంత్రి కేటీఆర్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందిస్తూ.. కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా చేసిన సర్కార్ నిర్లక్ష్యం వల్ల కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారుతున్నాయని మండిపడ్డారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో వ్యవసాయాన్ని దండగ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో వచ్చిన నీళ్లు.. కాంగ్రెస్ పాలనలో ఎందుకు రావడం లేదని రైతులే ప్రశ్నిస్తున్నారన్నారు. రైతులకు కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని కేటీఆర్ ట్వీట్ చేశారు. 'కాలం కాటేయడం లేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం కాటేస్తున్నది. కరువు కాటేయడం లేదు.. కాలువల్లో నీళ్లు వారించకుండా కాంగ్రెస్ కాటేస్తున్నది. కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా కక్షగట్టిన సర్కార్ నిర్లక్ష్యం మూలంగా కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారుతున్నాయి. అద్దాలమేడలో ఊరేగుతున్న అబద్దాల కాంగ్రెస్ మూలంగా అంధకారంలో తెలంగాణ రైతన్న ఆందోళన చెందుతున్నాడు. దశాబ్దాల పాలనలో దండగ చేసిన వ్యవసాయాన్ని దశాబ్ద బీఆర్ఎస్ పాలనలో పండగ చేస్తే .. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో తిరిగి దండగ చేశారు. కానీ పండగల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఊరేగుతున్నది. బీఆర్ఎస్ పాలనలో వచ్చిన కాళేశ్వరం నీళ్లు.. కాంగ్రెస్ పాలనలో ఎందుకు రావడం లేదని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. దాదాపు



ఆరువందల మీటర్ల ఎత్తున ఎగిసిన కాళేశ్వరం నీళ్లు సుమారు 450 కిలోమీటర్ల దూరం ప్రయాణించి సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్ మండలంలో రావిచెరువు వరకు చేరి రైతుల పొలాలను తడిపిన నీళ్లు నేడెందుకు పారడం లేదని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. శ్రీరాంసాగర్ కింద 2001లో పూర్తయిన కాకతీయ వరద కాలువ 22 ఏళ్ల తర్వాత కాళేశ్వరం ఎత్తిపోతల మూలంగా 153 కిలోమీటర్లు ప్రయాణించి చివరి ఆయకట్టుకు చేరాయి. కానీ నేడు మేడిగడ్డ మరమ్మతులు చేయకుండా, కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు ఎత్తిపోసి సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా, కాంగ్రెస్ సర్కార్ ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంతో అటువైపు కన్నెత్తి చూడడం లేదు. వ్యవసాయంపై కక్షగట్టిన కాంగ్రెస్ సర్కార్ రైతన్నలకు శిక్ష వేస్తున్నది.

## మరింత బలోపేతం కానున్న చైనాతో ద్వైపాక్షిక సంబంధాలు: ఎస్ జైశంకర్



**న్యూఢిల్లీ,జూలై,14:**మరింత బలోపేతం కానున్న చైనాతో ద్వైపాక్షిక సంబంధాలు: ఎస్ జైశంకర్ భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సోమవారం చైనా పర్యటనలో ఉన్నారు. ఐదేళ్ల తర్వాత మొదటిసారి చైనా పర్యటనకు వెళ్లిన జైశంకర్, బీజింగ్‌లో చైనా ఉ పాధ్యక్షుడు హాన్ జెంగ్‌తో సమావేశం అయ్యారు. అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటం, రష్యాతో సంబంధాలున్న దేశాలపై 500 శాతం సుంకం విధిస్తామని అమెరికా హెచ్చరించిన ఈ నేపథ్యంలో చైనాతో భారత్ చర్చలకు సిద్ధమవడం చర్చకు దారితీసింది. హాన్ జెంగ్‌తో సమావేశం ద్వారా రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు మెరుగ్గా ఉన్నాయని, భవిష్యత్తులో మరింత బలోపేతం అయ్యేందుకు అవకాశాలు ఉన్నాయని జైశంకర్ అభిప్రాయపడ్డారు. హాన్ జెంగ్‌తో జరిగిన సమావేశంలో, జైశంకర్ చైనా షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) అధ్యక్ష పదవికి భారత మద్దతును వ్యక్తం చేశారు.

# సీఎం రేవంత్ ప్రోత్సాహం- యువ క్రీడాకారుల ఉత్సాహం

**- ఏడాది పదవీ కాలం ఎంతో సంతృప్తి నిచ్చింది**

**- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి**



**హైదరాబాద్, జూలై 14, (తెలంగాణ దిశ)** :ఏడాది పదవీ కాలం ఎంతో సంతృప్తి నిచ్చిందని, అనుకున్న దాని కన్నా ఎంతో వేగంగా పని చేశామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. స్పోర్ట్స్ చైర్మన్ గా బాధ్యతలు తీసుకొని ఏడాది కాలం పూర్తి అయిన సందర్భంగా సోమవారం ఎల్ బి స్టేడియంలోని తన ఛాంబర్ లో స్పోర్ట్స్ అథారిటీ అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతలు చేపట్టి ఏడాది కాలంలోనే అనేక జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించడమే కాకుండా క్రీడాభిమానుల ప్రశంసలు పొందామని తెలిపారు.దేశంలోనే ఆదర్శవంతమైన నూతన క్రీడా విధానాన్ని ప్రకటించామని అన్నారు. సీఎం కప్ 2024 ను నిర్వహించి గ్రామీణ క్రీడాకారుల్లో ఉత్తేజం కలిగించామని ఆయన అన్నారు. 20 సంవత్సరాల నుండి ఎటువంటి ఆధునీకరణకు నోచుకోని వివిధ స్టేడియాలను మరో 20 సంవత్సరాల భవిష్యత్తు అవసరాలకు సరిపడేలా ఆధునికరించామని ఆయన చెప్పారు. దశాబ్ద కాలంగా క్రీడారంగాన్ని విస్మరించిన గత ప్రభుత్వం క్రీడాకారులకు క్రీడా సంఘాలకు ఎన్నో బకాయిలు పెట్టి పోతే ఒక్కొక్కటిగా వాటన్నిటిని విడుదల చేస్తున్నామని ఆయన అన్నారు. హకీంపేట్ తో పాటు కరీంనగర్, అదిలాబాద్ క్రీడా పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు కావలసిన అన్ని సౌకర్యాలను మెరుగు పరుస్తున్నామని ఆయన తెలిపారు. ఎంత ఒత్తిడి, పని భారం ఉన్నా సరే కార్యక్రమాల విజయవంతానికి కృషి చేస్తున్న అధికారులు, కోచ్ లు, సిబ్బందిని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, అనిత, సుజాత, పద్మావతి ఇంజనీర్లు భాష, అశోక్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్లు కేఆర్ భట్టార్ కళ్యాణి మినిస్ట్రియల్ సిబ్బంది కోచులు స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు నాలుగవ తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

# ఫ్యూచర్ ఒలింపియన్లను తయారు చేస్తాం..

**- చిన్న నాటి నుండే క్రీడల పట్ల ఆసక్తి కలిగిద్దాం**

**- ఫ్యూచర్ ఒలంపియన్స్ లోగో ఆవిష్కరణ**

**- స్పోర్ట్స్అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి**





**హైదరాబాద్, జూలై 14, (తెలంగాణ దిశ)** :భావి ఛాంపియన్లను తీర్చిదిద్దాలంటే చిన్ననాటి నుండే క్రీడల్లో ఆసక్తి కలిగిన వారిని గుర్తించి ప్రోత్సహించాలని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. ఫ్యూచర్ ఒలంపియన్స్ సంస్థ లోగోను సోమవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సెల్ ఫోన్ గేమ్స్ కు బానిసలు అవుతున్న చిన్న పిల్లలను క్రీడల పట్ల ఆసక్తి కలిగించి వారిని భావి ఛాంపియన్లుగా తీర్చిదిద్దడానికి ఫ్యూచర్ ఒలంపియన్స్ సంస్థ కృషి చేయడం సంతోషకరమని ఆయన అన్నారు. చిన్న తనం నుండే క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా ఆరు నెలల పసిపాపల నుండి 6 సంవత్సరాల పిల్లల కోసం వివిధ కార్యక్రమాలు రూపొందించి పిల్లల్లో క్రీడా ఆసక్తి కలిగించడం సంతోషకరమని ఆయన అన్నారు. ఒలంపిక్ తరహా పోటీలను చిన్నపిల్లలకు అర్థమయ్యే విధంగా, వారికి ఆసక్తి కలిగిన క్రీడాంశంలో వారు రాణించేట్లుగా వివిధ దేశాల్లో ప్రాచుర్యంలో ఉన్న మాదిరిగా ఫ్యూచర్ ఒలంపియన్స్ సంస్థ ఆలోచనలు చేయడం పట్ల ఆయన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, సుజాత, అనిత, పద్మావతి, ఫ్యూచర్ ఒలంపియన్స్ ఫౌండర్ కె. శివప్రసాద్, కో ఫౌండర్ ఎం. ఆదర్శ్ డైరెక్టర్లు కె. నవ్య, వరదరాజు, వై. కార్తీక్, బేబీ శ్రీధ తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారునికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



**కుత్బుల్లాపూర్, జూలై 14, (తెలంగాణ దిశ)** :ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ 60 వేల చెక్కునుసోమవారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి 131 డివిజన్ బాపునగర్ కు చెందిన పరిపటి అజిత కు అందజేశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చికిత్సకు సరిపడా స్థోమత లేక హన్మంత్ రెడ్డిని సంప్రదించారు. దీంతో ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 60 వేలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించి సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాపు నగర్ వాసులు పరిపటి అజితకు రూ. 60 వేలు మంజూరీ పత్రాన్ని చెక్కు అందజేశారు. అనంతరం హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని అలాగే అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలి : కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, జూలై 14, (తెలంగాణ దిశ)** :కార్మిక విభాగాన్ని బలోపేతం చేస్తూ.. కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ సూచించారు. కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ నూతన కమిటీ సభ్యులు సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. లేబర్ సెల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కందాడి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నూతన లేబర్ సెల్ కమిటీని నియమించారు. లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి దువ్వారి తేజశ్వరరావు, ఉపాధ్యక్షులు చెవిటి శ్రీనివాస్, కంచగారు దుర్గయ్య, కొంపల్లి మున్సిపాలిటి అధ్యక్షులు దండు నరేంద్రరాజు తదితరులను శ్రీశైలం గౌడ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకార్మిక విభాగానికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ సెల్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షులు కావలి గోపాల్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆంజనేయులు, కమ్మరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు నాగారంలో విద్యుత్ సరఫరా లో అంతరాయం కలిగే ప్రాంతాలు




**నాగారం, జూలై 14, (తెలంగాణ దిశ)** :చెట్ల కొమ్మల కత్తిరింపు కారణంగావిజయపురి కాలనీ ఫీడర్ పరిధిలోని చక్రిపురం సబ్ స్టేషన్ పరిధిలో నీ కాలనీలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని నాగారం విద్యుత్తు ఏఈ ఎ. రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా విజయపురి కాలనీ, బాబూజీ నగర్, ఎస్ వి నగర్, ఎంఎన్ (మామిల్లా నారాయణ) కాలనీ లలో సరఫరా లో అంతరాయం కలుగుతుందన్నారు. అదేవిధంగాసత్య నారాయణ కాలనీ ఫీడర్ నాగారం సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్తు సరఫరా లో అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఈ కారణంగా సాయి శ్రీజా ఎన్ క్లేవ్, మాదిరెడ్డి మల్లారెడ్డి కాలనీ, తూర్పు గాంధీ నగర్, పశ్చిమ గాంధీ నగర్, రవీంద్ర నగర్, గోపి కృష్ణ కాలనీ, సాయి సంజీవ నగర్, సాయి దుర్గా నగర్, అరవింద్ నగర్, మణి ఎన్ క్లేవ్, ఎస్ఎల్ఎన్ కాలనీ, తివారి ఎన్ క్లేవ్, జిఎస్ఆర్ గార్డెన్, హనుమాన్ నగర్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# గాంధీనగర్ లో అట్టహాసంగా ఫలహారం బండి ఊరేగింపు






**కాప్రా,జూలై 14, (తెలంగాణ దిశ)** :కాప్రా గాంధీ నగర్ లో సోమవారం సాయంత్రం అట్టహాసంగా ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. మేళ తాళాలు, ఆకర్షణీయమైన విద్యుత్తు దీపాల మధ్య శోభా ఒగా ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. పోత రాజుల నృత్యాల నడుమ జరిగిన ఊరేగింపులో పలువురు ప్రముఖులు పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాప్రాలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం ధర్మకర్త, జి. సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తన్నీరు శ్రీహరిల పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొత్త అంజి రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆహ్వానం...





**కాంగ్రెస్ అగ్ర నేత, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడురాహుల్ గాంధీని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో ఢిల్లీలో కలిసి కుమార్తె జయారెడ్డి వివాహానికి రావాలని ఆహ్వానించారు.**

(న్యూఢిల్లీ తెలంగాణ దిశ)

# అంగన్‌వాడీ కేంద్రాల కుతకుత..!



**కరీంనగర్,తెలంగాణ దిశ:** కరీంనగర్ జిల్లాలో ప్రచండ భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం ఏడింటి నుంచే పుడమిపై పంజా విసురుతున్నాడు. మరో నెలన్నర దాకా వదిలిపెట్టేది లేదన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల చేరువకు చేరాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తుతూ ఉదయం 10 గంటల నుంచి ఇళ్లకే పరిమితమవుతున్నారు.విద్యార్థులకు పరీక్షలు కూడా ముగియగా, ప్రభుత్వం వేసవి సెలవులు కూడా ప్రకటించింది. కానీ, అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నడుస్తున్నాయి. వీటిలోకి వచ్చే చిన్నా రులు, బాలింతలు, గర్భిణులకు వేసవిలో అందించాల్సిన కనీస సౌకర్యాలు కరువవగా, వారంతా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారుప్రధానంగా పూర్వ ప్రాథమిక విద్య కోసం కేంద్రాల్లోకి వచ్చే చిన్నారుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఉదయం హుషారుగా వస్తున్న వారంతా మధ్యాహ్నం వరకు తోటకూర కాడలా వాడిపోతున్నారు. విశాలమైన గదిలో మంచినీటి వసతితో పాటు గాలి కోసం ఫ్యాన్ కూడా విధిగా కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే అధికారుల పట్టింపు లేనితనం, సిబ్బంది నిర్లక్ష్యం వెరసి జిల్లాలోని అనేక కేంద్రాల్లో ఈ సౌకర్యాలు కొరవడ్డాయనే విమర్శలు వస్తున్నాయి. దీంతో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రాలకు పంపడం లేదు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి కూలీ, నాలీ చేసుకునే వారికి మాత్రం పంపక తప్పని పరిస్థితి. అలాగే పౌష్టికాహారం కోసం గర్భిణులు, బాలింతలు కూడా కేంద్రాలకు విధిగా వెళ్లాల్సి ఉండగా, వారి పరిస్థితి కూడా ఇలాగే ఉన్నది. జిల్లాలో మొత్తం 777 కేంద్రాలు ఉండగా, వీటి ద్వారా 9650 మంది చిన్నారులు, 3620 మంది గర్భిణీలు, 4000 మంది బాలింతలు సేవలు పొందుతున్నారు. వీరందరి కోసం జిల్లాలో 307 సొంత భవనాలు మాత్రమే ఉండగా, అద్దె పవనాలు 211, ఇతర భవనాల్లో 119 కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిలో విద్యుత్ సరఫరా లేని కేంద్రాలు 125 వరకు ఉండగా, విద్యుత్తు ఉన్న ఫ్యాన్లు లేని కేంద్రాలు 100 వరకు ఉన్నట్లు అంగన్వాడి వర్గాల ద్వారా తెలుస్తుంది. గతేడాది నుంచి మార్చిలొనే ఎండలు మండుతుండగా, కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు చేయకపోవడంపై అటు నిర్వాహకులు, ఇటు చిన్నారులు, బాలింతలు, గర్భిణీల నుంచి తీవ్ర అసహనం వ్యక్తం అవుతోంది. కొన్నిచోట్ల కేంద్రాలకు సమీపంలో చెట్ల కింద చిన్నారులకు చదువులు చెబుతుండగా, విధిలేని చోట మాత్రం చీకటి గదుల్లో ఉక్కపోతతోనే నెట్టుకొస్తున్నారు. దాంతో, చాలా కేంద్రాల్లో చిన్నారులు, లబ్ధిదారుల హాజరుశాతం తగ్గుతుంది. ఉదయం 8 గంటలకు కేంద్రాలు తెరుస్తున్నప్పటికీ రావడానికి వెనుకాడుతున్నట్లు కేంద్రాల నిర్వాహకులు పేర్కొంటున్నారు. కేంద్రాలకు రావాలని ఒత్తిడి చేసి సిబ్బంది తీసుకెళుతున్నా గదుల్లో వేడికి చిన్నారులు తట్టుకోలేక పలు చోట్ల అస్వస్థతకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో తమ పిల్లలను పంపేందుకు పెద్దగా ఆసక్తి కనబరచటం లేదు. ఫలితంగా కనీస సౌకర్యాలు లేని సెంటర్లన్నీ లబ్ధిదారులు లేక బోసిపోతున్నాయి. తద్వారా కొన్ని కేంద్రాల్లో ఆరోగ్యలక్ష్మి ద్వారా భోజనాన్ని వండిపెట్టడం లేదు. మరికొన్ని చోట్ల భోజనం వండిపెడితే బాక్సుల ద్వారా ఇంటికి తీసుకెళ్తున్నారు. మునుముందు కూడా ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశాలు ఉండటంతో, ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని, లబ్ధిదారుల ఇంటికే సరుకులు అందించాలనే డిమాండ్ పెరుగుతున్నది.అవసరమైన చర్యలకు ప్రతిపాదనలు పంపాం..: జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉన్న క్రమంలో, కేంద్రాల్లో చేపట్టాల్సిన చర్యలపై ప్రతిపాదనలు పంపామని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు కేంద్రాలను నడిపిస్తున్నాం. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఉదయం పూట ఆటపాటలతో చదువు చెప్పి భోజనం పెట్టిన అనంతరం ఇంటికి పంపించేలా చూస్తున్నాం.


# సంపాదకీయం

## అవయవ దానంతో ఆయువు పోద్దాం!

మరణించిన తరువాత కూడా జీవించగలిగే దానమే అవయవ దానం. 1954లో విజయవంతమైన మొదటి అవయవ మార్పిడిని పురస్కరించుకుని అవయవ దాన ప్రాధాన్యతను గురించి అవగాహన కల్పించడానికి ప్రపంచ అవయవ దాన దినోత్సవం ప్రారంభించబడింది. అవయవ దానం, అవయవ మార్పిడి ఆవశ్యకతను ప్రజలందరికీ తెలియపరిచే విధంగా ఆగస్టు 13న ప్రపంచంలోని అనేక దేశాలు ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. మన దేశం మాత్రం ఆగస్టు 3న అవయవ దాన కార్యక్రమాన్ని జరుపుకుంటుంది. భారతదేశంలో 1994 ఆగస్టు 3న విజయవంతంగా జరిగిన మొట్టమొదటి గుండె మార్పిడి శస్త్ర చికిత్స గుర్తుగా ఆగస్ట్ 3వ తేదీని జాతీయ అవయవ దాన దినోత్సవంగా మన దేశంలో జరుపుకుంటున్నాం. ఈ సంచలనాత్మక శస్త్రచికిత్సలో బ్రెయిన్ డెడ్ వ్యక్తి కుటుంబం దానం చేసిన గుండె మరొక వ్యక్తి జీవితాన్ని కాపాడింది. ఈ తేదీ భారతదేశ అవయవ మార్పిడి ప్రయాణంలో కీలక ఘట్టాన్ని సూచిస్తుంది. అవయవ దాన ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయడం, అవయవ దానం చేయడంపై ప్రజల్లో ఉన్న సందేహాలను తొలగించి అవయవ దానాన్ని మరింత ప్రోత్సహించడం, అవయవ దాతలకు కృతజ్ఞతలు చెప్పడమన్నది ఈ సందర్భం ముఖ్య ఉద్దేశ్యం. అవయవ దానం అనేది ప్రాణాలను రక్షించే ప్రక్రియ. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం భారత దేశంలో దాదాపుగా మూడు లక్షల మంది అవయవ మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారు. అవయవాల అందుబాటు, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా లేదు. ఫలితంగా ప్రతి రోజు 20 మంది రోగులు అవయవ మార్పిడి కోసం ఎదురు చూస్తూ మరణిస్తున్నారు. మన దేశంలో 2013లో 4990 మందికి అవయవ మార్పిడి జరగ్గా, 2022లో ఈ సంఖ్య 15,561కి పెరిగింది. ఈ పదేళ్లలో అవయవ దానం రేటు నాలుగు రెట్లు పెరిగింది. అంచనాల ప్రకారం దేశంలో కోటి మందికి గాను 0.65 అవయవ దానాలు మాత్రమే జరుగుతున్నాయి. అత్యధిక జనాభా ఉన్న దేశాల జాబితాలో భారత్ రెండవ స్థానంలో ఉన్నప్పటికీ మన దేశంలో కేవలం 0.1 శాతం మంది మాత్రమే అవయవ దానం చేయడానికి నమోదు చేసుకున్నారు. అవయవ దాతల సంఖ్య కూడా అవసరాలకు తగినంత లేదు. అవయవ దాతల సంఖ్య మరింతగా పెరగాల్సి ఉంది. అవయవ దానంపై లేనిపోని అపోహలు, మతపరమైన నమ్మకాలు, ఆచారాల వంటి వాటి కారణంగా చాలా మంది అవయవ దానానికి ముందుకు రావడం లేదు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ 2019 లెక్కల ప్రకారం, సంవత్సరానికి 1.5 నుండి రెండు లక్షల మందికి కిడ్నీ మార్పిడి అవసరం అవుతుంది. కానీ దాదాపు 8,000 మంది మాత్రమే అందుకోగలుగుతున్నారు. అంటే నాలుగు శాతం మంది ప్రజలు మాత్రమే దీనిని పొందుతారు. అదే విధంగా ప్రతి సంవత్సరం 80,000 మంది రోగులకు కాలేయ మార్పిడి అవసర మవుతుంది. కేవలం 1,800 మంది మాత్రమే పొందగలుగు తున్నారు. సంవత్సరానికి సుమారు లక్ష మంది రోగులకు కంటి మార్పిడి అవసర మవుతుంది. అయితే సగం కంటే తక్కువ మంది మాత్రమే దీనిని పొందగలుగుతున్నారు. గుండె మార్పిడి చేయాల్సిన 10,000 మందిలో కేవలం 200 మంది మాత్రమే చేయించుకో గలుగుతున్నారు. అవయవ దానం చేస్తున్న వారిలో మహిళల సంఖ్యే ఎక్కువగా ఉంటోంది. ఇచ్చేవారిలో 80 శాతం ఆడవారు ఉంటున్నారు. తీసుకునేవారిలో 80 శాతం మగవాళ్లు కాగా, 15 శాతం మాత్రమే మహిళలు ఉంటున్నారు. ఇంటి పెద్దకు ఏం కాకూడదని భార్య..కొడుకు బతకాలని తల్లి..అన్న బాగుండాలని చెల్లి%ౌ%ఇలా అయినవాళ్లను కాపాడుకునేందుకు మహిళలు ముందుకు వస్తున్నారు. మరోవైపు మగవారి నుంచి అవయవాలను తీసుకునేందుకు ఆడవాళ్లు ఒప్పుకోవడం లేదు. కుటుంబ భారం మోసేవాళ్లు ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో మహిళలు ఉండడమే ఇందుకు కారణం. మరణించిన ఒక అవయవ దాత కళ్ళు, మూత్రపిండాలు, గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, పాంక్రియాస్, పేగులు, చర్మాలను అంటే ఎనిమిది అవయవాలను దానం చేయవచ్చు. జీవించి ఉన్న వ్యక్తి మూత్రపిండం, కాలేయం నుంచి కొద్ది భాగాన్ని మాత్రమే దానం చేయవచ్చు. నేత్ర దానం చేయడం వల్ల ఇద్దరికి చూపు వస్తుంది. అలాగే మరణించిన వ్యక్తి చేసే అవయవ దానం ద్వారా 8 మందికి కొత్త జీవితాలను ప్రసాదించవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా మార్పిడి చేయబడిన అవయవాల స్థానంలో కిడ్నీ మొదటి స్థానంలో ఉండగా తరువాతి స్థానంలో కాలేయం ఆ తరువాత స్థానంలో గుండె ఉన్నాయి. అవయవ దాత శరీరం నుంచి గుండెను తీసిన తర్వాత దాన్ని 4 గంటల్లోగా అవసరమైన వారికి అమర్చాలి. ఊపిరితిత్తులు కూడా అంతే. అదే మూత్రపిండాలను శరీరం నుంచి వేరు చేసిన 30 గంటల్లోగా మార్పిడి చేయొచ్చు. కాలేయం, పాంక్రియాస్ 12 గంటల్లోగా మార్పిడి చేయాలి అవయువ దానం చేసిన వారి త్యాగాన్ని గౌరవిస్తూ వారి అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించ నున్నట్టు తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అవయవదానానికి సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేశారు. ఇది చాలా మంచి ఆలోచన. అవయవ, దేహ దానాన్ని ప్రచారం చేయడంలో దీని పాత్ర చెప్పుకోదగ్గది. ఒక వ్యక్తి చనిపోయినప్పుడు, అతని గుండె పని చేయడం మానేస్తుంది. ఇతర భాగాలు పనికి రాకుండా పోతాయి. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి మాత్రమే అవయవాలు తొలగించవచ్చు. రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది తీవ్రంగా గాయపడుతూ ఉంటారు. కొందరు మెదడు బాగా దెబ్బ తిని, పూర్తిగా స్పృహ కోల్పోయి, తిరిగి కోలుకోలేని స్థితిలోకి వెళ్లిపోతుంటారు. ఇలాంటి వారిలో గుండె, కాలేయం, కిడ్నీల వంటి అవయవాలు పని చేస్తుంటాయి కానీ వీటన్నింటినీ నడిపించే కీలక అవయవమైన మెదడు మాత్రం పనిచేయదు. దీనినే బ్రెయిన్ డెడ్ అంటారు. పక్షవాతం వంటి మెదడు సమస్యల బారినపడ్డ వారిలోనూ ఇలాంటి స్థితి తలెత్తవచ్చు. ఈ దశలో ఉన్నవారి అవయవాలను సేకరించి, అవసరమైనవారికి అమర్చవచ్చు. భారతదేశంలో అవయవ దానం విషయంలో కుటుంబం పాత్ర చాలా ముఖ్యమైనది. అనేక పాశ్చాత్య దేశాలలో వయోజనుల అంగీకారాన్ని ప్రభుత్వం అమలు చేయగలదు. చనిపోయిన తర్వాత కూడా ప్రభుత్వం అమలు చేసే వీలుంటుంది. భారతదేశంలో కుటుంబానికి వదిలివేయబడుతుంది. దాత కార్డు ఉన్న వ్యక్తి బ్రెయిన్ డెడ్ అయిన సందర్భంలో అవయవాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ఆమోదించాల్సి ఉంటుంది. మానవ అవయవాల మార్పిడి చట్టం కోసేస్తారని చాలామందిలో ఉన్న అభిప్రాయం. ఇది వాస్తవం కాదు. అవయవదానం చేసినప్పటికీ, పనికి వచ్చే అవయవాలను తొలగించి, అవసరంలో ఉన్నవారకి అమర్చిన తర్వాత దాత శరీరాన్ని వైద్యులు గౌరవంగా చూస్తారు. తగిన రీతిలో అంత్యక్రియలు నిర్వహించడానికి వీలుగా దానిని సిద్ధంచేసి, దాత బంధువులకు అప్పగిస్తారు. అవయవ దానానికి వయసుతో నిమిత్తం లేదు.

# గుండె నిండా ఏడ్వండి..

## జపాన్ సూత్రం రూయికాట్సు...!



మనసుకేదో బాధ. మందు వేసుకుంటే తగ్గదు. మర్చిపోదామంటే కుదరదు. నోరు పెగల్చలేని పరిస్థితి. బాధ చెప్పుకోలేని దుస్థితి. కన్నీరు మాత్రం కట్టలు తెంచుకుంటుంది. వెల్లువలా పొంగి, చెక్కిలిని దాటి గుండెలను తాకుతుంది. ఆ తడిలో ఏదో సాంత్వన దాగుంది. నిమిషాలు గడిచేకొద్దీ మనసు ఊరడిల్లుతుంది. సరేలే ఊరుకో.. అని తనకు తానే నెమ్మదిస్తుంది. హా.. తెలిసింది! బాధకు మందు దొరికింది. కన్నీరే కష్టానికి మందు! ఇదే సూత్రాన్ని చెబుతుంది జపనీస్ వెల్‌నెస్ టెక్నిక్ 'రూయికాట్సు'. ఒత్తిడి, వేదనలో ఉన్నవారికి హాయిగా ఏడ్చే అవకాశాన్ని కల్పించే వర్క్‌షాప్‌లు దీని ఆధారంగా జరుగుతున్నాయా దేశంలో. గుండెనిండా ఏడ్చేస్తే మనసు తేలికపడి మళ్లీ మామూలు మనిషవ్వడమే ఇందులోని ప్రత్యేకత!

నిప్పు వెంటే నీరునూ, బాధ వెంటే కన్నీరునూ దేవుడే సృష్టించి ఉంటాడు. అందుకే కొన్నిసార్లు నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు దుఃఖం పొంగుకొస్తుంది. అయితే ఏడ్వడానికి మనమేమైనా చిన్నపిల్లలమా! ఎవరైనా చూస్తే ఎంత ఇబ్బందిగా ఉంటుంది. అసలు ఏమిటా ఏడుపు%ౌ% అని మనకే అనిపిస్తుంది. కానీ, గుండె బండలా మారడం కంటే ద్రవించి కరిగిపోవడమే మేలని చెబుతుంది రూయికాట్సు సూత్రం. అందుకోసం పరిస్థితుల్ని కల్పించి మరీ ఈ పద్ధతిలో తరగతులు నిర్వహిస్తున్నారు. సాధారణంగానే పనిభారం ఎక్కువగా ఉండే జపాన్ ప్రజలు వీటికి మొగ్గు చూపుతున్నారు. ఈ ట్రెండు 2013నుంచి జపాన్‌లో నడుస్తున్నది. దీనికోసమే ప్రత్యేకంగా ట్రైనర్లూ ఉన్నారు. అయితే కన్నీరుఎలా పెట్టుకున్నామన్నదీముఖ్యమే అంటుంది రూయికాట్సు. ఇంతకీ రూయికాట్సు అంటే కన్నీరును తెప్పించే ప్రక్రియ అని అర్థం. నలుగురూ కూర్చుని మాట్లాడుకోవడం కాదు, నలుగురూకూర్చుని ఏడ్వండి..ఏం ఫర్వాలేదు అని చెబుతుంది ఇది.

మనసు కరిగేలా: ఎంత ఒత్తిడి, ఆందోళన, భయం, బాధ ఉన్నాసరే.. ఓ చోటుకు వెళ్లి పదిమందిలో కూర్చున్నప్పుడు గబుక్కున ఏడ్వమంటే ఏడుపు రాదు. అవతలి వాళ్లు ఏమనుకుంటారో, జాలి పడతారా, చిత్రంగా చూస్తారా, పరువు సంగతేంటి.. ఇలా ఎన్నో భయాలు మన మెదళ్లలో నాటుకుపోయి ఉంటాయి. అందుకే రూయికాట్సులో కళ్లనీళ్లు పెట్టుకునే సందర్భాలను కల్పిస్తారు. అంటే హృదయాన్ని కదిలించే చిత్రం చూపించడమో, కన్నీరు పెట్టించే కవితలు, ఉత్తరాలు చదివించడమో, మనసును కదిలించే కథలు వినిపించడమో ఉంటుంది ఇక్కడ. వీటివల్ల మనకు తెలియకుండానే దుఃఖం తన్నుకొస్తుంది. అలాంటప్పుడే మన బాధా గుర్తొస్తుంది. అన్నీ కలుపుకొని బోరున ఏడ్వమని చెబుతుంది ఈ థెరపీ.

ఏదో ఊరికే ఓ కన్నీటి చుక్క కంటి నుంచి రావడం కాదు, గట్టిగా ఏడిస్తేనే మంచిదంటుంది. 'ఓరి బాబూ మషాయో.. నా జీవితాన్ని బుగ్గిపాలు చేశావు కదరా.. నీ జిమ్మడి పోను' అన్న లెవెల్లో పెద్ద పెద్దగా వెక్కిళ్లు పెట్టి ఏడిస్తే మరింత ఊరట పొందుతారని చెబుతుంది. వినేందుకు చిత్రంగా ఉన్నా నిజంగా ఇది మేలు చేస్తుందని అంటున్నారు వెళ్లిన వాళ్లు, శిక్షకులు. మసక వెలుతురు, మంద్రమైన సంగీతం, చేతిలో కర్ఛీఫ్ దీనికి నేపథ్యం అన్నమాట.



ఇక, బాలానాం రోదనం బలం అన్నట్టు ఏడుపు పెద్దలకూ బలమే. శోకం ఇమ్యూనిటీని పెంచుతుంది అని చెబుతున్నారు. అయితే ఇలా చటుక్కున వచ్చే ఏడుపు మాత్రమే మనసును సేదతీరుస్తుంది. దగ్గరి వారిని పోగొట్టుకున్న దుఃఖం మాత్రం సుదీర్ఘకాలం ఇబ్బంది పెడుతుంది. ఆ కన్నీరును, ఈ కన్నీరుతో పోల్చకూడదు అంటారు వీళ్లు. హిడేఫుమి యోషిదా అనే ప్రముఖ రూయికాట్సు శిక్షకుడైతే కొన్ని వేలమందికిఇలాంటి ఎమోషనల్ రిలీజ్‌థెరపీ ఇచ్చారట. అంతేఅంతమందితో ఆయన కళ్లనీళ్లుపెట్టించారన్నమాట! ఉరుకులు పరుగుల జీవితంలో ఎవరి కష్టం వారిది. ఒక్కరుగా కూర్చుని చింతించడం మరింత ఒత్తిడిని పెంచుతుంది.

అందుకే మనమెవరో తెలియని చోట, మనలాంటి వాళ్లే నలుగురున్న చోట, మనసును తేలికపరచు కునే ఈ ఏర్పాటు చాలామందినేఆకట్టుకోవడం వింతేం కాదు కదూ!పరిశోధనలూ చెబుతున్నాయి: కన్నీరు కార్చడం వల్ల మానసిక, శారీరక మార్పులెన్నో జరుగుతాయని పరిశోధనలూ చెబుతున్నాయి. జపాన్‌లోని తోహో యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం ఏడ్వడం వల్ల ఆందోళన (యాంగ్జయిటీ) తగ్గుముఖం పట్టి, గుండె కొట్టుకునే వేగం నెమ్మదిస్తుంది.

తద్వారా ప్రశాంతమైన నిద్ర పడుతుందట. ఉద్వేగం వల్ల వచ్చే కన్నీళ్లలో కార్టిసాల్ అనే స్ట్రెస్ హార్మోన్ ఉంటుంది. ఒత్తిడికి కారణమయ్యే ఇది బయటికి పోవడం అన్నది శరీరానికి మేలు చేసే విషయం. ఈసమయంలో విడుదలయ్యే ఎండార్ఫిన్లు నొప్పులను తగ్గించి, మూడ్‌ను స్థిమిత పరుస్తాయి. తాను తరచూ జలుబు బారిన పడేదాన్ని అని, రూయికాట్సు పద్ధతి ద్వారా ఇలా వారానికి ఒకసారి ఏడ్వడం వల్ల ఆ బాధ నుంచి బయట పడ్డాననీ ఈ తరహా వర్క్‌షాప్‌కి వెళ్లిన ఓ మహిళ సోషల్ మీడియాలో పంచుకున్నారు.

# ఉగ్రవాదుల ఏరివేతకు కాశ్మీర్‌ను జల్లెడ పట్టాలి...



పర్యాటక స్వర్గధామం అయిన జమ్మూ కాశ్మీర్‌లో నరమేధం సృష్టించడం ద్వారా అక్కడ సాధారణ పరిస్థితులు రాకుండా... సామాన్య జనం అక్కడ లేకుండా..ముఖ్యంగా హిందువులను లేకుండా చేయాలన్న ముస్లిం ఉగ్రవాదుల కుట్రలో భాగమే తాజా నరమేధానికి నిదర్శనం. 370 ఆర్టికల్ రద్దు తరవాత కాశ్మీర్ అభివృ ద్ధి చెంది, పర్యాటకంగా పునరుత్తేజం పొందడాన్ని ఉగ్రవాదులు, వారికి సహకరిస్తున్న పాక్ జీర్ణించుకోవడం లేదు. ఈ దాడిని ముందే పసిగట్టడంలో కూడా భద్రతాబలగాలు విఫలం అయ్యారు. ఇకపోతే ఇదొక అనుభవంగా, గుణపాఠంగా కాశ్మీర్‌ను మొత్తం మిలిటరీకి అప్పగించాలి. శ్రీలంకలో ఈలం అన్నది లేకుండా చేసేందుకు సైనిక చర్య చేపట్టి విజయం సాధించారు. అనేక దేశాల్లో ఇలాంటి ఆపరేషన్లు జరిగాయి. ఇప్పుడు కాశ్మీర్‌లో జల్లెడ్ పట్టాలి. అణువణువు పరిశీలించాలి.. అక్కడి స్థానికులను రక్షిస్తూనే... కొత్తగా వస్తున్న వారిపై నిఘా పెంచాలి. జల్లెలడ పట్టాలి. లెఫ్ట్ తీవ్రవాదం కన్నా ఇస్లామిక్ తీవ్రవాదం చాలా ప్రమాదకరం. మావోయిస్టులను ఏరివేసే పనిని పక్కన పెట్టి కాశ్మీర్‌లో ఇస్లామిక్ తీవ్రవాదులను ఏరివేసే కార్యక్రమాలను ముమ్మరం చేయాలి. ఈ క్రమంలో పాక్‌తో సరిహద్దుల్లో భద్రత పటిష్టం చేయాలి. అలాగే ఆక్రమిత కాశ్మీర్‌లో నరమేధానికి శిక్షణ ఇస్తున్న శిబిరాలను లేపేయాలి. అవసరమైతే పాక్ ఆక్మిత కాశ్మీర్‌ను విలీనం చేసుకోవాలి. అందుకు కార్యాచరణ సిద్దం చేయాలి. భారత్ అంటే బలమేమిటో సత్తా చాటి పాక్‌కు గట్టిగా బుద్ది చెప్పాలి. మాటలతో పాక్ దారికి రాదు. దానికి గట్టిగా ఉద్ది చెప్పేందుకు సైనిక చర్యకు దిగాలి. 2008లో ముంబై దాడి తర్వాత సివిలియన్లపై జరిగిన రెండో అతిపెద్ద ఉగ్రదాడి ఇదే. జమ్మూ కాశ్మీర్ ప్రాంతం పాకిస్తానీ తీవ్రవాదులకు ఇంకా నిలయంగానే ఉందని ఈ సంఘటన చెపుతున్నది. ఉగ్రసంస్థ మతప రమైన లక్ష్యాలను సాధించడానికి లేదా ఒక నిర్దిష్ట మత సమూహానికి వ్యతిరేకంగా దాడులు నిర్వహిస్తోంది. ప్రస్తుతం జరిగిన సంఘటన ఈ రకమైనదే. తహావూర్ హుస్సేన్ రాణాను అమెరికా భారత్‌కు అప్పగించిన తర్వాత దేశంలో ఉగ్రవాద చర్యలు జరిగే అవకాశం ఉందనే సమాచారం కేంద్ర ఇంటెలిజెన్స్ సంస్థ ముందుగానే తెలిపింది. అయితే, కేంద్రం, జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం సున్నిత పర్యాటక ప్రాంతమైన జమ్మూలో ముందుగానే కేంద్ర, రాష్ట్ర బలగాలను అప్రమత్తం చేయడంలో కొంత విఫలమైనట్టు ఒప్పుకోవాలి. ఇప్పటికైనా పర్యాటకులకు ఆటంకం లేకుండా నిరంతర గస్తీని పెంచాలి. బలగాలను ప్రతి గ్రామంలోనూ మోహరించాలి. ప్రపంచంలో ఇస్లామిక్ ఉగ్రవాదం భయంకరమైనదిగా నరరమేధం సృష్టిస్తోంది. దీనిని ప్రపంచ ముస్లింలు కూడా తీవ్రంగా వ్యతిరేకించాలే చర్యలకు పూనుకోవాలి. జమ్మూకాశ్మీర్లో మతపరమైన లక్ష్యాలు సాధించేందుకు ఉగ్రదాడులు జరుగుతున్నాయి. ఇస్లామిక్ టెర్రరిస్ట్ గ్రూపులు అయిన లష్కర్ -ఏ -తోయిబా, జైష్ -ఏ - మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థలు ఈ దాడులు చేస్తున్నాయి. వీరిని ఏరివేసేందుకు ఎలాంటి మీనమేషాలు లెక్కించ రాదు. ఎంత కఠినమైన పనయినా వీరిని కలుపు మొక్కల్లా ఏరిపారే యాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వానికి ఉగ్రవాదాన్ని అణచివేసే శక్తి లేకుపో వడం వల్ల కేంద్ర మిలిటరీ వ్యవస్థ జమ్మూకాశ్మీర్ ప్రాంతాన్ని తమ అధీనంలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. పాక్ తన కుయుక్తులను కేవలం ఉగ్రదాడులకే ఉపయోగిస్తోంది. పాక్‌ను ఇక ఎట్టి పరిస్థితు ల్లోనూ నమ్మడం కాదు...దానిని అన్ని రకాలుగా నిర్వీర్యం చేయాలి. ఇప్పటికే అనేక మారణహోమాలు సాగాయి. ఇలాగే మిన్నకుంటే మరిన్ని దాడులు జరుగుతాయి. భారత్‌పై కన్నేస్తే అంతే సంగతులు అన్నట్లుగా పరిస్థితులు మారాలి. ఇజ్రాయిల్ తరహా శిక్షణతో సైన్యాన్ని రాటుదేలించాలి. పాక్‌ను ప్రపంచంతో వేరు చేసే అన్ని చర్యలు తీసుకోవాలి. అలాగే భారత్ నుంచి ఎలాంటి సాయం అందకుండా చూడాలి. ఈ క్రమంలో ఇలాంటి టెర్రరిస్టుల దాడులను తీవ్రంగా తీసుకోవాల్సిన బాధ్యత కేంద్రంపైనే ఉంది. తాజా దాడిలో ప్రత్యేకం గా హిందూవర్గంవారిని గుర్తించి మరీ కాల్పులు జరపడం అందరూ ఆలోచించా ల్సిన విషయం. పహల్గాంలో జరిగిన సంఘటనలో బాధితుల ముందు తీవ్రవాదులు చేసిన వ్యాఖ్యలు అత్యంత అమాన వీయమైనవి. దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు వారి వ్యాఖ్యల్లో కనిపిస్తున్నాయి. గత మూడేళ్లుగా కాశ్మీర్ పర్యాటక రంగం పుంజుకు ంది. కాశ్మీరీలకు ఉపాధి అవకాశాలు బాగా పెరిగాయి.

# మైనింగ్ ఆఫీసు మూసివేత

**మహబూబ్ నగర్:,తెలంగాణ దిశ:** నాగర్ కర్నూల్ జిల్లా మైనింగ్ శాఖ కా ర్యాలయానికి అద్దె భవనం దొరకక అవస్థలు తప్పడం లేదు. గత కొద్దికాలంగా ప్రస్తుతం ఉన్న అద్దె భవనంలో కార్యాలయం ఖాళీ చేయాలని యజమానులు ఒత్తిడి తేవడంతో అధికారులు అయోమ యంలో పడ్డారు. గత ప్రభుత్వం అన్ని శాఖలకు ఉమ్మడిగా జిల్లా ల్లో కలెక్టరేట్ కార్యాలయాన్ని నిర్మించినప్పటికీ ఆ కార్యాలయంలో మైనింగ్ శాఖకు భవనాన్ని కేటాయించకపోవడంతో చాలాకాలంగా మార్కెట్ యార్డ్ సమీపంలోని అదే భవనంలోనే మైనింగ్ శాఖను కొనసాగిం చారు. గత కొన్ని నెలలపాటు ఖాళీ చేయా లని ఒత్తిడి తెచ్చినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో గత రెండు రోజుల క్రితం అద్దె భవనం యజమానులు కార్యాలయానికి ఇంటర్నెట్, విద్యుత్ కనెక్షన్ వంటివి తొలగించారు. కార్యాలయానికి సేవ లు అందుకునే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడింది.

పట్టణంలోని ఆయా రెంట్ బిల్డింగ్ కోసం అన్వేషణ జరుగుతున్నప్పటికీ రెంట్ ధర ఎక్కువగా చెబుతుండడంతో అధికారులు అయోమయంలో పడ్డారు. ప్రభు త్వం నిర్మించిన పాత కలెక్టరేట్ భవనం, ప్రస్తుత కలెక్టరేట్ భవనాలు అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని కార్యాలయాలు నేటికీ అద్దె భవనంలోనే కొనసాగుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని విమర్శలు ఉన్నాయి.ప్రస్తుతం అద్దె భవనం దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్న మై నింగ్ శాఖ కార్యాలయానికి కూడా జిల్లా ఉన్నతాధికారులు కార్యాలయాన్ని ఏర్పాటుకు సహకరించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్యులు.ప్రస్తుతం జిల్లాలో మన ఇసుక వాహనం పథకం అమల్లోకి తీసుకొచ్చిన నేపథ్యంలో వినియోగదారులు సామాన్యులు ఇంటి నిర్మాణం కోసం ఇసుక ఆన్లైన్ దరఖాస్తులను చేసుకుంటున్నారు. దీంతోపాటు ఆయా వినియోగదారులకు రీచ్ నుంచి ఇసుకను తరలించిన అనంతరం వాటి నివేదికలను ఆన్లైన్లో పొందుపరచాల్సి ఉం టుంది ఆ తర్వాతే ఇసుక ట్రాక్టర్ యజమానులకు చెల్లింపులు బ్యాంకు ద్వారా పూర్తి అ వుతాయి.

దీంతోపాటు మైనింగ్ శాఖ సం బంధించిన అన్ని సేవలు నిలిచిపోయాయి. దీంతో సామాన్యులు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం అద్దె భవనం కోసం జిల్లాలో అక్కడక్కడ అన్వేషణ జరుగుతోంది. ఒక ప్రాంతంలో అద్దె భవనాన్ని పరిశీలించారు. లేదా రో జు పరిశీలించి మైనింగ్ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం సేవలు ఫోన్ ద్వారా కొనసాగిస్తూనే ఉన్నామంటున్నారు అధికారులు.

# ఉగ్రవాదులను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందింది - సీపీఐ

**కరీంనగర్,తెలంగాణ దిశ:** ఇటీవల దేశంలోని పలు ప్రాంతాలలో జరిగిన వరుస ఉగ్రవాద దాడులను తీవ్రంగా ఖండిస్తూ, కరీంనగర్ జిల్లా సీపీఐ కమిటీ ఆధ్వర్యంలో నాడు తెలంగాణ కమాన్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేసి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి ముది వెంకటస్వామి మాట్లాడుతూ, ఉగ్రవాదుల దుర్మార్గపు చర్యల కారణంగా అమాయక ప్రజలు, పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నా రు.

# మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దగ్ధం కేసులో మాధవరెడ్డి అరెస్ట్

**మదనపల్లె,తెలంగాణ దిశ:** రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దగ్ధం కేసులో అన్నమయ్య జిల్లా మదనపల్లె రెడ్డీస్ కాలనీకి చెందిన వైసిపి నేత, రైస్ మిల్ మాధవరెడ్డిని రాత్రి తిరుపతి సిఐడి పోలీసులు అరెస్టు చేశారు. సిఐడి డిఎస్పి కొండయ్య నాయుడు కథనం మేరకు.. గత ఏడాది జూలైలో జరిగిన ఫైళ్ళ దగ్ధం కేసులో ఏ టు ముద్దాయిగా ఉన్న మాధవరెడ్డి కండిషన్ బెయిలుపై బయట తిరుగుతూ ఉన్నాడు.

# ఔటర్‌ను అనుసంధానం చేస్తూ...



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్‌ను అనుసంధానం చేస్తూ 36 వరకు రోడ్డు మార్గాలు, నాలుగు చోట్ల రైలు మార్గాలు ఉన్నాయి. రోడ్డు, రైలు మార్గాలతో పాటు మెట్రో మార్గం కలిస్తే భవిష్యత్ ప్రజా రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉండే అవకాశాలున్నాయి. ఆ దిశగానే సీఎం రేవంత్ రెడ్డి ఉత్తర హైదరాబాద్ వైపు రెండు మెట్రో కారిడార్లు, దక్షిణ హైదరాబాద్ వైపు మరో కారిడార్‌కు డీపీఆర్‌లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశిం చారు. దీంతో మెట్రోరైలు సౌకర్యం ఔటర్‌రింగు రోడ్డును దాటి నగర శివారు ప్రాంతాలకు అందుబాటులోకి రానుంది. హైదరాబాద్ మెట్రోరై లు ప్రాజెక్టు మొదటి దశలోని జేబీఎస్ నుంచి ఎంబీజీఎస్ మార్గంలో 11 కిలోమీటర్లు ప్రస్తుతం నగరవాసులకు అందుబాటులో ఉంది. రెండోదశలో చేపట్టబోయే జేబీఎస–శామీర్‌పేట (22 కి.మీ), ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ), చాంద్రాయణ గుట్ట నుంచి ఇన్నర్ రింగు రోడ్డు మీదుగా ఆరాంఘర్, శంషాబాద్ టౌన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టులోపలి వరకు (35 కి.మీ),అదేవిధంగా శంషాబాద్ ఎయిర్ పోర్టునుంచి ఫోర్త్ సిటీ(ఫ్యూచర్ సిటీ) వరకు (40కి.మీ).. ఇలా మొత్తం 115 కిలోమీటర్ల మెట్రో మార్గం ఉత్తర దిక్కున ఉన్న శామీర్‌పేట ఔటర్ రింగు రోడ్డు నుంచి దక్షిణ దిక్కున ఉన్న ఫోర్త్ సిటీతో అనుసంధా నం అవుతుంది. దీంతో గ్రేటర్ హైదరాబాద్‌చుట్టూ 158 కిలోమీటర్ల మేరఉన్న ఔటర్ రింగు రోడ్డుకు ఉత్తరాన ఉన్నశామీర్‌పేట నుంచి సి కింద్రాబాద్, ముషీరాబాద్,ఎంజీబీ ఎస్,చార్మినార్ మీదుగా చాంద్రాయ ణగుట్ట, శంషాబాద్ విమానాశ్రయం అక్కడి నుంచి ఫోర్త్ సిటీ వరకు మెగా మెట్రో కారిడార్ అవతరించనుంది. హైదరాబాద్ మహానగరంలో ఉ త్తర–దక్షిణ దిక్కులను కలిపే మెగా మెట్రో కారిడార్‌లో ఎంజీబీఎస్, జేబీఎస్‌వంటి బస్‌స్టేషన్‌లు, ఎంఎంటీఎస్,ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపో కలు సాగించే సికింద్రాబాద్, ఫలక్‌నుమా,బుద్వేల్, శంషాబాద్, అల్వాల్, బొల్లారంవంటి రైల్వే స్టేషన్‌లతో అనుసంధానంఅవుతుంది.

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో

# కోతలు విధించొద్దు..

**సిద్దిపేట,తెలంగాణ దిశ:**ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు విధించకుండా అమలు చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. వర్చువల్‌గా నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 50 లక్షల ఈజీఎస్ కార్డులు ఉంటే కోటి రెండు లక్షల మంది ఉపాధి హామీ కూలీలుగా పనిచేస్తున్నారని వీరంతా కూలీ పనికి వెళ్లే నిరుపేదలు అని తెలిపారు. ఎస్సీ ఎస్టీ, బీసీ రైతుల ఎక్కువగా ఉంటారు. రాష్ట్రంలో కోటి 2 లక్షల మంది వ్యవసాయ కూలీలు ఈ కార్డుల ద్వారా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నారు. గుంట భూమి ఉన్న రైతులను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించం అని ప్రభుత్వం చెప్పడం దురదృష్ట కరమన్నారు. ఒక్క సెంటు భూమి ఉన్నా కూలీ కాదు అని అంటున్నారు. ఉపాధి హామీ పథకంలో ఈ సంవత్సరం 20 రోజులు పని దినాలు ఉంటేనే కూలీగా గుర్తింపు ఉంటుందనే నిబంధన కూడా సరైంది కాదన్నారు. అనారోగ్య సమస్యలతోనూ ఇతర సమస్యలతోనూ పనికి వెళ్లని కూలీలను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించరు అని ప్రభుత్వం చెప్తున్నది. ఈ నిర్ణయాన్ని కూడా ప్రభుత్వం మార్చి రైతు కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు గుంటలు ఉన్న రైతుకు సంవత్సరానికి రైతు భరోసా కింద రూ.1500 మాత్రమే వస్తాయి. ఐదు గుంటలు ఉన్న రైతుకు వ్యవసాయ కూలీ కింద రూ.12000 ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద నష్టపోతారని పేర్కొన్నారు. ముఖ్యంగా దళితులు, గిరిజనులు.. తాతకు ఎకరం భూమి ఉంటే పిల్లలు పంచుకుంటే అది ఐదు గుంటలు వస్తాయి. 5గుంటలో పంట పండింది లేదు..

# నేషనల్ హైవేలు,రాష్ట్ర రహదారులపై ఫోకస్




కడప: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేషనల్ హైవేలు, రాష్ట్ర రహదారులపై ఫోకస్ పెట్టింది. కొత్త ప్రాజెక్టులతో పాటుగా గతంలో అనుమతులు వచ్చిన వాటి పనుల్ని వేగవంతం చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ కర్ణాటక రా ష్ట్రాలకు సంబంధించి కీలకమైన బెంగళూరు–కడప–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు స్పీడ్ అందుకున్నాయి. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పనుల్ని 2026నాటికి పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నా రు.. ఈ మేరకు పనులు కొనసాగుతున్నాయి. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేతో అమరావతి నుంచి బెంగళూరుకు కనెక్టివిటీ ఉంటుంది. వి జయవాడ నుంచి వెళ్లాలంటే గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం, కడప మీదుగా వెళ్లొచ్చు. అలాగే గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి మీదుగా బెంగళూరకు వెళ్లొచ్చు.కేంద్రం నేషనల్ హైవేల నిర్మాణంలో భాగంగా బెంగళూరు–కడప–విజయవా డకు కొత్తగా హైవే కనెక్టివిటీ ఉండాలని భావించింది.

అందుకే రెండేళ్ల క్రితం ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేకు రూ.1930 కోట్ల అంచనాతో గ్రీన్ సిగ్నల్ రావడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఈ హైవేకు సంబంధించి.. విజయవాడ నుంచి బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలం ముప్పవరం వరకు 113 కి.మి జాతీయ రహదారులతో ఈ గ్రీన్ ఫీల్డ్ వేను కనెక్ట్ చేయనున్నారు. అలాగే బెంగళూరు నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా కొడికొండ వరకు ఉ న్న 73 కి.మి కూడా జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తారు. మొత్తం 529 కిలో మీటర్ల దూరం మార్గంలో ఇప్పటికే రెండు వైపులా ఉన్న రెండు నేషనల్ హైవేల 186 కి.మి. మినహా మరో 343 కిలోమిటర్లు పనులు చేపట్టాల్సి ఉంది.బెంగళూరు–కడప–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేను 14 భాగాలుగా చేశారు. బాపట్ల జిల్లా జే.పంగు లూరు మండలం ముప్పవరం నుంచి తాళ్లూరు మండలం తూర్పు గంగవరం వరకు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.

బాపట్ల జిల్లాలో 10 కిలోమిటర్లు, ప్రకాశం జిల్లాలో 18.5 కిలోమిటర్లు ఈ పనులు జరుగుతున్నాయి. ఈ హైవే పొడవునా ఎక్కడా కట్టడాలు దెబ్బతిన కుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే ఈ గ్రీన్‌ఫీల్డ్ వేకు సంబంధించి భూములు కోల్పోయిన వారికి పరిహారం కూడా చెల్లిం చారు. ఈవేవెంట ఉన్న ప్రతి ఊరికి బ్రిడ్జి ఏర్పాటు చేస్తు?నారు.

అలాగే గుండ్లకమ్మ నదిపై బాపట్ల జిల్లా అద్దంకి మండలం వేలమూరిపా డు–మణికేశ్వరం మధ్యలో 360 మీటర్ల పొడవున భారీ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ వే నిర్మాణం పూర్తయితే అమరావతి నుంచి బెంగళూరు త్వరగా వెళ్లొచ్చు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు కనెక్టివిటీని పెంచేందుకు సిద్దమైంది.. ఈ మేరకు హైవే ప్రాజెక్టు పనులు వేగవంతం చేసింది.

# క్యూ ఆర్ కోడ్ లో రేషన్ కార్డులు




**కర్నూలు,తెలంగాణ దిశ:**ఏపీలో త్వరలోనే నూతన రేషన్ కార్డులు అందుబాటులోకి రానున్నాయి. నవ దంపతులకు కొత్త కార్డులు జారీ చేయనుండగా, పేర్ల మార్పు చేర్పులకు అవకాశం కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు రాజకీయ పార్టీల రంగులతో ఇచ్చిన రేషన్ కార్డులకు చరమగీతం పాడడంతో పాటు అత్యాధునిక కార్డులను అందించేందుకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ సన్నాహాలు ప్రారంభించారు.ఆరునెలల పాలనా కాలంలో క్రమంగా అధికార యంత్రాంగాన్ని గాడిన పెడుతూ వస్తున్న కూటమి ప్రభుత్వం.. క్రమంగా ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ వస్తోంది. అందులో భాగంగా పౌర సరఫరాల శాఖలోని అవినీతిపై పెద్ద ఎత్తున దాడులు చేస్తూ.. అక్రమార్కుల ఆట కట్టించింది. ఇక ఇప్పుడు.. నూతన లబ్ధిదారుల ఎంపిక, వారికి జారీ చేయనున్న కార్డుల విషయమై కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ ఆగిపోగా.. అనేక మంది లబ్దిదారులకు కార్డులు జారీ కాలేదు. అలాంటి వారందరికీ ఇప్పుడు.. సరికొత్త కార్డులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.కొత్తగా పెళ్లైన దంపతులకు, రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్ల మార్పులు, చేర్పులకూ అవకాశం కల్పించనున్నారు. ఇందు కోసం.. ప్రత్యేకంగా.. ఆన్ లైన్ పోర్టల్ ప్రారంభించనున్నారు. అందుబాటులోని సాంకేతికతను వినియోగించుకుని.. ఇకపై రేషన్ కార్డుల్ని క్రెడిట్ కార్డుల తరహాలో క్యూఆర్ కోడ్ లతో జారీ చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే.. సన్నాహాలు కూడా పూర్తయ్యాయి. ఈ నెల చివర్లో కానీ, వచ్చే నెల ప్రారంభంలో కానీ.. రాష్ట్ర వ్యాప్తంగా కార్డుల్ని జారీ ప్రక్రియ మొదలు పెట్టనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.కార్డులపై క్యూఆర్ కోడ్ ఉండనుండగా.. అందులో కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాలు ఉండనున్నాయి. రేషన్ పంపిణీ సమయంలో ఆ కోడ్ ను స్కాన్ చేస్తే పూర్తి వివరాలు తెలిసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపితే.. వెంటనే కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించను న్నారు. ప్రస్తుతం.. అధికార యంత్రాగం, ప్రభుత్వం వివిధ పనుల్లో బిజీబిజీగా గడుపుతోంది. తీరికలేని హడావిడిలో ఉండడంతోనే.. కార్డుల ఆమోదం, జారీ ప్రక్రియ ఆలస్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వం హయంలో కొత్తగా పెళ్లైన వాళ్లకు వెనువెంటనే రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించారు. కానీ.. కొన్ని నెలలకే ఆ విధానాన్ని పక్కన పెట్టేశారు. ఆరునెలలకు ఓ సారి మాత్రమే కొత్త కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. దాంతో.. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా మంజూరు చేయాల్సిన కొత్త కార్డులు చాలానే మిగిలిపోయాయి. ఈసారి వాటిని జారీ చేయడంతో పాటు వెనువెంటనే నూతన దంపతు లకు కార్డులు మంజూరు చేసే అవకాశాన్ని కల్పించనున్నట్లు సమాచా రం రాష్ట్రంలోని చాలా రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు తప్పుల తడకగా మారాయి. దాంతో.. అనేక పథకాల లబ్ధిదారులు నష్టపోతు న్నారు. పేర్లు తేడాగా ఉంటున్న కారణంగా చాలా పథకాలకు అనుసం ధానించేందుకు వీలు కావడం లేదు. పైగా..ఆన్ లైన్ విధానాన్ని సైతం ఆపేయడంతో.. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి.ఈ సమస్యల న్నింటినీ ఈ సారి నూతన కార్డుల జారీ సమయంలో పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1.48 కోట్ల రేషన్ కార్డులు ఉండగా.. 3.36 లక్షల రేషన్ కార్డు సమస్యలు పెండింగ్ లో ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. వీటిలో.. 70 వేలకు పైగా నవదంపతుల నుంచి అందిన దరఖాస్తులుగా చెబుతున్నారు. కార్డుల్లో విభజన కోసం 46 వేలకు పైగా, కొత్త సభ్యుల చేరికలకు 2 లక్షల 13 వేలు, సభ్యులను తొలగించేందుకు 36 వేలు, అడ్రస్ మార్పుల కోసం 9 వేలకు పైగా దరఖాస్తులు అందగా.. రేషన్ కార్డుల్ని సరెండర్ చేసేందుకు 685 మంది సిద్ధంగా ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇలా.. అన్ని రకాలుగా చూస్తే మరో 2 లక్షల రేషన్ కార్డులు ఇవ్వాల్సి వస్తుందని అధికారుల అంచనా. దాంతో.. రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.50 కోట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# వీఆర్వోల స్థానంలో జే ఆర్వోలు!



**వరంగల్,తెలంగాణ దిశ:**భూ సమస్యల పరిష్కారం, భూముల పరిరక్షణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువ చ్చింది. ఈ పోర్టల్ ద్వారానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అయితే ధరణి కారణంగా చాలామంది భూముల నమోదులో పొరపాట్లు జరిగా యి. ఎక్కువ తక్కువ భూములు నమోదయ్యాయి. సాగులో లేని భూములను కూడా సాగు భూములుగా చూపించారు. దీంతో రైతులు అధికారుల చుట్టూ ఏళ్లుగా తిరుగుతున్నారు. సీసీఎల్ఏ కొన్ని సమస్యలు పరిష్కరించినా.. ఇప్పటికీ కలెక్టర్ల వద్ద వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక చాలా ప్రభుత్వ భూములు నాయకుల పేరిట పట్టాలు అయ్యాయి. అయితే కొందరు అధికా రుల తీరుతో భూరికార్డుల్లో తప్పు లు జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. లంచాలకు ఆశపడి, ప్రభుత్వ పెద్దల మాటలు విని, బెదిరింపులకు భయపడి ఇతర కారణాలతో కొందరు అధికారులు రికార్డులు మారుస్తున్నారు. ఈ క్రమంలో భూ వివాదాలు పెరుగుతు న్నాయి. ఈతరుణంలో రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలకు చెక్ పె ట్టాలని భావిస్తోంది. భూ భారతి చట్టాని రాష్ట్ర రెవెన్యూ అధికారులు వ్యతిరేకిస్తున్నారు. అయినా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. భూ ఒల వివరాలు తప్పుగా నమోదు చేసే అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా చట్టంలో నిబంధన పొందుపరిచారు. ఏఅధికారి స్థాయిలో తప్పు జరిగితే ఆ అధికారిపైనే చర్యలు తీసు కునేలా చట్టం ఉంది. అవసరమైతే ఆ అధికారిని ఉద్యోగం నుంచి తొలగించేలా నిబంధన చేర్చారు. ఇందు కు ఐఏఎస్ ఆఫీసర్లు కూడా అతీతులు కాదని సెక్రటేరియేట్ వర్గాలు తెలిపాయి. ఇక భూ సమస్యలను చాలా వరకు గ్రామస్థాయిలోనే పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రామాల్లో వీఆర్వోల స్థానంలో జే ఆర్వోలను నియమించాలని నిర్ణయించింది. ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక జేఆర్వో ఉంటారు. గత ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా జేఆర్వో వ్యవస్థను తీసుకు రావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా4 11 వేల మందిని నియమించేలా కసరత్తు చేస్తోంది

# ఆదాయం కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్

**అమరావతి,తెలంగాణ దిశ:** ఆదాయాన్ని పెంచుకునేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మె ంట్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగామార్చి నెలాఖరుకు కనీసం పదివేల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమా చారం. రిజర్వ్‌బ్యాంకు, కాగ్, అక్కౌంటెంట్ జనరల్ కార్యాలయం అధికారులు వెలువరిస్తున్న గణాంకాలు కూడా ఇదే అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. సొంత పన్నుల ఆదాయం పడిపోవడం, కేంద్రం నుంచి కూడా నిధుల రాబడి తగ్గిపోవడం వంటి కారణాలతో ఎ క్కువగా అప్పులపైనే ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపు ఖజానాకు వాస్తవంగా రావాల్సిన ఆదాయం కూడా తగ్గుతోందని ఆర్థికశాఖ అధికారులు అంటున్నారు. దీంతో బకాయి లపై ప్రధానంగా దృష్టి సారించాలని ఆర్థికశాఖ నిర్ణయించింది. రాష్ట్ర ఖజానాకు వాస్తవం గారావాల్సిన నిధుల్లో ఎక్కువగా అమ్మకపు పన్ను, జిఎస్‌టి, గను లు, విద్యుత్ బకాయిలు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు వంటి శాఖల నుంచే బకాయిలు ఉన్నాయని అధికారులు అంటున్నారు. ఒక్క గనుల శాఖ నుంచే నాలుగు వేల కోట్ల వరకు ఆదాయం రావాల్సి ఉందని ఆర్థికశాఖ అధికారి ఒకరు చెప్పారు. లీజు నిధులే కాకుం డా, రాయల్టీ, ఇతర వసూళ్లలో కూడా లోటు కనిపిస్తున్నట్లు చెబు తున్నారు. అందుకే పాత లెక్కలను వెలికితీసి బకాయిలుగా ఉన్న మొత్తాన్ని తిరిగి వసూలు చేయాలని



నిర్ణయించినట్లుఒక అధికారి వెల్లడించారు.ఇదే సమయంలో పెద్ద మొత్తంలోవిద్యుత్ బకాయి లు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, రిజిస్ట్రేషన్ల శాఖలో కూడా ఆదాయం తగ్గిందని చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖకు రాకుండానే క్షేత్రస్థాయిలోనే ఒప్పదాలు జరిగిపోతున్నాయని, అందుకే ఆదాయానికి భారీగా గండిపడుతోందని గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు.కేంద్రం నుంచి 30వేల కోట్లు రావాల్సి ఉ ండగా, కేవలం ఇప్పటివరకు పది వేలకోట్లు మాత్రమే రావడంపైనా ఆర్థిక శాఖ దృష్టి సారిస్తోంది. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని కనీసంగా పది వేలకోట్ల రూపాయలను మార్చి లోగా సమకూర్చు కోవాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన ఒక సమీక్షలో కూడా ఇదే దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది.

# విద్యారంగంలో కీలక మార్పులు!



**గుంటూరు,తెలంగాణ దిశ:**పాఠశాల విద్యా సంస్కరణలు అమలు చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 117ను ప్రస్తుత కూటమి ప్రభు త్వం రద్దు చేసింది. అయితే జీవో 117ను రద్దు చేసినప్పటికీ ఇంచుమిం చు అదే విధానాలతో మళ్లీ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులను విడుదల చేశారు. గత జీవో నెంబర్ 117లో కంటే కొన్ని మార్పులు చేశారు.గతం లో ఉన్న ఆరు రకాల పాఠశాలలకు బదులు ఐదు రకాల పాఠశాలల విధానాన్ని కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది. గతంలో ప్రవేశపెట్టిన శాటిలైట్ ఫౌండేషనల్ స్కూళ్ల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించింది. ఫౌండేషనల్ స్కూళ్లను అలానే కొనసాగించింది. అయితే ఫౌండేషనల్ స్కూల్ ప్లస్ పేరును బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా మర్చింది.ప్రీ హైస్కూల్ విధానాన్ని రద్దు చేసి మోడల్ ప్రైమరీ స్కూల్‌గా ముందుకు తీసుకొచ్చింది. 3,4,5 తరగతుల విలీనాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే హై స్కూల్ ప్లస్ విధానాన్ని ఏం చేస్తారో అనేది స్పష్టం ఇవ్వలేదు. ఫౌండేషనల్, బేసిక్ ప్రైమరీ స్కూళ్లకు 1:20 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్న విద్యా వేత్తల డిమాండ్‌ను పట్టించుకోలేదు. గత ప్రభుత్వం వలే ఇప్పుడు కూడా విద్యార్థి, ఉ పాధ్యాయ నిష్పత్తిని నిర్ణయించింది. పెరగనున్న ఏకోపాధ్యాయ పాఠశాలలు?: ఫౌండేషనల్ స్కూల్‌లో 1:30 నిష్పత్తి ప్రకారం ఉ పాధ్యాయులను కేటాయించింది. విద్యార్థులు సంఖ్య 30 దాటితే మరో ఎస్‌జీటీని కేటాయిస్తామని పేర్కొంది. బేసిక్ ప్రైమరీ స్కూల్‌లో 1:20 నిష్పత్తి ప్రకారం అమలుచేస్తామని 60 దాటితేనే మరోపోస్టు ఉంటుందని తెలిపింది. దీనివల్ల ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 60 కంటే తక్కు ఉంటే ఐదు తరగతులకు ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదుగురిని కేటాయిస్తారు.ఎన్‌రోల్‌మెంట్ 120 కంటే ఎక్కువ ఉంటే ప్రధానోపాధ్యాయ పోస్టు ఉంటుంది.

150 దాటితే ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఎస్‌జీటీ ఉంటారు. కొన్ని ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య 45–60 మధ్య ఉన్నా మోడల్ ప్రైమరీ స్కూల్ ఉంటుంది. అయితే సామాజిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాల ఆధారంగా పాఠశాల యాజమాన్య కమిటీ మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటును ప్రతిపాదించే అవకాశం ఉంటుంది. అయితే దీంతో మళ్లీ పాత పద్ధతికే పాఠశాల విద్య వస్తుంది. ప్రైవేట్ పాఠశాలల్లో చేరికలు పెరుగటంతో పాటు?. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్అవుట్ రేటు పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.విద్యార్థులు సంఖ్య 30కంటే తక్కువగా ఉన్న ప్రా థమికోన్నత పాఠశాలలను మోడల్, బేసిక్ ప్రైమరీగా మార్చుతారు. 6,7,8 తరగతుల విద్యార్థులను దగ్గరలో ఉన్న పాఠశాలలకు తరలిస్తారు. 6,7,8 తరగతులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60 కంటే ఎక్కువగా ఉంటే, దానిని హైస్కూల్‌గా మార్చుతారు. హైస్కూ ల్‌లో విద్యార్థుల సంఖ్య 76 కంటే ఎక్కువగా ఉంటేనే ప్రధానోపాధ్యా యుడు, పీఈటీ పోస్టులు ఉంటాయి. విద్యార్థుల సంఖ్య 400 దాటితే ఆయా స్కూల్స్‌కు రెండో పీఈటీని కేటాయిస్తారు. విద్యార్థుల సంఖ్య 751ఉంటే మూడో పీఈటీ పోస్టు ఉంటుంది. పోస్టులు, విద్యార్థుల సంఖ్యఆధారంగా మ్యూజిక్, ఆర్ట్, డ్రాయింగ్,క్రాఫ్ట్ పోస్టులు ఉంటాయి. గ్రామపంచాయతీ,మున్సిపల్ వార్డులలో మోడల్ ప్రైమరీస్కూల్ గుర్తించే ందుకు కమిటీలు ఏర్పాటు చేశారు. మండల స్థాయిలో ఉండే కమిటీలో కన్వీనర్‌గా ఎంఈవో–1,కోకన్వీనర్‌గా ఎంఈవో–2ఉంటారు. సభ్యులు గా ఐసీడీఎస్ సీడీపీవో, ఉంటారు. క్లస్టర్‌స్థాయి కమిటీల్లో కన్వీనర్‌గా క్లస్టర్ ప్రధానోపాధ్యా యుడుకన్వీనర్‌గా, సభ్యులుగాఎంఈవో 1,2, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఉంటారు.

## భవన నిర్మాణ అనుమతులు మరింత సరళం..!

**విజయవాడ,తెలంగాణ దిశ:** ఏపీలో భవన నిర్మాణాలు,లే ఔట్ల అనుమతుల జారీలో నిబంధన లు సులభతరం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ బిల్డింగ్ రూల్స్–2017, ఏపీల్యాండ్ డెవలప్మెంట్ రూల్స్ – 2017 లో సవరణలు చేస్తూ వేరు వేరుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా భవన, లే అవుట్ల అనుమ తుల్లో మార్పులు తీసుకొచ్చినట్టు మంత్రి నారాయణ చెప్పారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగేలా కీలక సంస్కరణలతో ఉ త్తర్వులు జారీ చేశామని, సంక్రాంతి కానుకగా బిల్డర్లు, డెవలపర్లు, ప్రజలకు అనుకూలంగా ఉండేలా నిబంధనలు మార్పులు జీవోలు జారీ చేసినట్టు చెప్పారు.లేఅవుట్లలో వేసే రోడ్లకు గతంలో ఉన్న12 మీటర్లకు బదులు 9 మీటర్లకు కుదిస్తూ సవరణ చేశారు. 500 చ.మీ.పైబడిన స్థలాల్లో చేపట్టే నిర్మాణాల్లో సెల్లారుకు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. టీడీఆర్ బాండ్ల జారీ కమిటీలో రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ ల ప్రమేయాన్ని తొలగిస్తున్నట్టు ప్రకటించారు.రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారుల ను ఆనుకుని ఉన్న స్థలాలు డెవలప్ చేసేందుకు 12 మీటర్ల మేరకు సర్వీస్ రోడ్డు విడిచిపెట్టాలనే నిబంధన తొలగిస్తున్నట్టు ప్రకటించారు. బహుళ అంతస్తుల భవనాల సెట్ బ్యాక్ నిబంధనల్లో మార్పులు చేశారు. వీటితో పాటు మరిన్ని నిబంధనలు సరళతరం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగేలా చేసేందుకు సంస్కరణలు చేపట్టి.. ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో లే అవుట్లలో రోడ్లకు గతంలో 12 మీటర్లు ఉండగా.. ఇప్పుడు దానిని 9 మీటర్లకు తగ్గించారు.

# బీజేపీ టార్గెట్ ఫిక్స్ చేసుకుందా



**రాజమండ్రి,తెలంగాణ దిశ:**బిజెపి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు కి ఎమ్మెల్సీ సీటు దక్కింది. ఖాళీ అయిన 5 ఎమ్మెల్సీ స్థానాల్లో మూడు టిడిపి, ఒకటి జనసేన తీసుకోగా పట్టుబట్టి మరి బిజెపి మరొకటి తీసుకుంది. ఇంతవరకు బానే ఉంది కానీ ఆ ఒక్క సీటు ని బిజెపి హోమ్ వీర్రాకు కట్ట బెట్టడం పై టిడిపి శ్రేణుల నుండి విమర్శలు ఎక్కువవుతున్నాయి. సోము వీర్రాజు బిజెపికి అత్యంత నమ్మకమైన వ్యక్తి. పార్టీకి పూర్తిగా అంకితమైపోయిన నాయకుడు. అంతవరకు ఓకే కానీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి సానుభూతిపరుడుగా టిడిపి శ్రేణులు భావిస్తుంటాయి. ఎందుకంటే గతంలో చంద్రబాబు నాయుడు పై ఆయన చేసిన విమర్శలే కారణం. బిజెపికి రాష్ట్ర అధ్యక్షుడుగా ఆయన ఉన్న సమయంలో టిడిపి అంటే మండిపడుతుండేవారు. ఆయన అధికంగా చేసిన విమర్శలు తెలుగుదేశం పైనే. దానితో ఇప్పుడు ఎమ్మెల్సీ స్థానాన్ని ఆయనకు ఎలా కేటాయిస్తారు అంటూ క్షేత్రస్థాయి టిడిపి కార్యకర్తలు నుండి అసహనం వ్యక్తం అవుతోంది. నిజానికి ఈ సీటును బిజెపికి చెందిన ఉత్తరాంధ్ర నాయకుడు మాధవ్ కి కేటాయిస్తారని ప్రచారం జరిగింది. కానీ సడన్ గా సోము వీర్రాజు పేరు ఖరారైంది. ప్రస్తుతానికి శాసనమండలిలో వైసిపిదే బలం. అక్కడ తమ వాయిస్ బలంగా వినిపించడానికి కూటమి నాయకులు వైసిపి పాలన లో జరిగిన తప్పులను ఎండగట్టే నాయకులకే ఎమ్మెల్సీ సీట్లు కట్టబెడుతోంది. టిడిపి నుంచి గ్రీష్మ, జనసేన నుండి నాగబాబు ఆకోవకు చెందినవారే. బిజెపి నుండి మాత్రం గతంలో టిడిపి పై విమర్శలు చేసిన సోమ వీర్రాజుకి ఎమ్మెల్సీ సీటు ఇస్తే ఆ స్థాయిలో వైసీపీపై విరుచుకుపడతారా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు తెలుగు తమ్ముళ్లు. సోము వీర్రాజు మెగా ఫ్యామిలీకి సన్నిహితుడు. ఆయన గతంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు అయిన వెంటనే హైదరాబాద్ వెళ్లి మరీ మెగా ఫ్యామిలీని కలిసి వచ్చారు. ప్రస్తుతం సోము వీర్రాజుకి ఎమ్మెల్సీ సీటు దక్కడం వెనక జనసేన అధిపతి పవన్ కళ్యాణ్ రిఫరెన్స్ పని చేసింది అంటున్నారు. ఏపీలో ఎలాగైనా బలపడే ప్రయత్నాలు చేస్తున్న బిజెపి తగ్గట్టుగానే వ్యూహాలు పన్నుతోంది. అందులో భాగంగానే తమకు అత్యంత నమ్మకంగా ఉండే సోము వీర్రాజుకు ఎమ్మెల్సీ సేటు కేటాయించేలా చేసింది. ప్రస్తుతం ఏపీలో ఉన్న బిజెపి నాయకుల్లో అంతో ఇంతో మాస్ ఇమేజ్ ఉన్నది సోము వీర్రాజు కు మాత్రమే. ఆయనకు ఎమ్మెల్సీ కేటాయించడం ద్వారా కార్యకర్తలకు ఒక మెసేజ్ పంపినట్టు ఉంటుందని మరింతమంది బిజెపి వైపు తిరిగే ఛాన్స్ ఉంటుందనేది వారి ఆలోచన. మాధవ్ తో పోలిస్తే సోము వీర్రాజు కాస్త దూకుడుగా ఉండే వ్యక్తి. ఇది పార్టీని మాస్ లోకి తీసుకువెళ్లడానికి ఉపయోగపడుతుందని పార్టీ అధిష్టానం భావిస్తుంది. 2027లో ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ స్థానాల్లో మాధవ్ కి సీటు ఇవ్వడం ద్వారా ఎన్నికలకు దగ్గరలో ఉత్తరాంధ్ర ప్రజలకు కూడా న్యాయం చేశామనే మెసేజ్ పంపే ఆలోచన బిజెపి హై కమాండ్ చేస్తోంది. అయితే కూటమిలో చేరింది అన్న ఒకే ఒక కారణంతో రాష్ట్రంలో ఖాళీ అయ్యే ప్రతి పదవి లోనూ బిజెపి వాటాకు రావడం పై అసహనం వ్యక్తం చేస్తున్నాయి టీడీపీ శ్రేణులు. ఇప్పటికే ఒక రాజ్యసభను ఆర్ కృష్ణయ్య కోసం తీసుకుపోయారు. విజయసాయి రెడ్డి ఖాళీ చేసిన స్థానాన్ని కూడా బిజెపి అడుగుతోంది. అది కాకుండా ప్రస్తుతం ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాల్లోనూ ఒకటి బీజేపీ పట్టుకుపోవడం అది కూడా చంద్రబాబుపై గతంలో విమర్శలు గుప్పించిన సోము వీర్రాజు కు కేటాయించడం పై టీడీపీ శ్రేణులకు మింగుడు పడడం లేదు.

# కోకో రైతు కుదేలు



ఏలూరు : కోకో పంటకు ధర లేక రైతులు కుదేలవుతున్నారు. గతేడాది కిలో వెయ్యి రూపాయలు పలకగా ప్రస్తుతం రూ.600కు పడిపోయింది. కోకో గింజలు కొనుగోలు చేసే కంపెనీలు సిండికేటై రైతులకు సరైన ధర దక్కకుండా చేస్తున్నాయి.

తమకు అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న ధర అందేలా చూడాలని రైతులు రోడ్డెక్కి గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గతేడాది పలికిన ధరకు, ప్రస్తుత ధరకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరిలో 50 వేల ఎకరాల్లో కోకోను సాగు చేశారు. కోకో గింజలను చాక్లెట్, కేకులు వంటివాటి తయారీలో అధికంగా వినియోగిస్తున్నారు. కొబ్బరి, పామాయిల్ తోటల్లో అంతర్ పంటగా కోకోను సాగు చేస్తున్నారు. ఎకరా కొబ్బరి తోటలో 180 నుంచి 240 మొక్కలు, పామాయిల్ తోటలో 150 మొక్కలు వరకూ నాటుతారు. ఒక ఎకరాలో సాగుకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకూ పెట్టుబడి అవుతోంది. ఎకరాకు రెండున్నర క్వింటాళ్ల నుంచి నాలుగు క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తోంది. జనవరి నుంచి జూన్ వరకూ కోకో సీజన్ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం కోకో సీజన్ ముమ్మరంగా సాగుతోంది. పాత, కొత్త పంట మొత్తం వెయ్యి టన్నుల వరకూ రైతులు వద్ద ఉన్నట్లు సమాచారం.

గతేడాది అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కిలో కోకో గింజలకు వెయ్యి రూపాయలు ధర పలికింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో కిలో ధర రూ.900 ఉంది. రైతుల నుంచి రూ.600కు మించి కంపెనీలు కొనుగోలు చేయడం లేదు. అంతరాఌ్జయ మార్కెట్ ధరతో పోలిస్తే రైతులు కిలోకు దాదాపు రూ.300 వరకూ నష్టపోతున్నారు. ఎకరాకు దాదాపు రూ. 70,000 నష్టపోతున్నారు. దాదాపు 20 కంపెనీలు, ట్రేడర్స్ రైతుల నుంచి కోకో గింజలను సేకరిస్తున్నారు. కంపెనీలన్నీ సిండికేట్‌గా మారి రైతులకు ధర దక్కకుండా చేస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో పంటకు ధర అమలు చేయాలని గత కొన్ని రోజులుగా రైతులు ఆందోళనలు చేస్తున్నారు. జిల్లా మొదలుకుని రాష్ట్ర స్థాయి అధికారుల వరకూ అందరినీ కలిసి తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. ఏ ఒక్క అధికారి వారి మొరు ఆలకించలేదు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కంపెనీల సిండికేట్‌ను అరికట్టి అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా ధర అందేలా చర్యలు తీసుకోవాలని కోకో రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# పార్టీ విధేయులకు పెద్ద పీట

**విజయవాడ,తెలంగాణ దిశ:**సస్పెన్స్ వీడిపోయింది. దాదాపు నెల రోజులుగా టీడీపీ నుండి ఎవరు ఎమ్మెల్సీలు అవుతారంటూ జరుగుతున్న చర్చకు తెరపడింది . కావలి గ్రీష్మ, బీద రవిచంద్ర, భీటీ నాయుడు పేర్లను టీడీపీ తరపున ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సి అభ్యర్థులు గా ప్రకటించారు చంద్రబాబు నాయుడు. మొత్తం ఐదు సీట్లు ఖాళీ అవగా మూడు టిడిపి, ఒకటి జనసేన, మరొకటి బిజెపి తీసుకున్నాయి. జనసేన తరఫున ఇప్పటికే కొణిదెల నాగబాబు నామినేషన్ వేశారు. టిడిపి నుంచి చాలామంది ఆశావహులు పోటీపడినా చంద్రబాబు మాత్రం పై ముగ్గురికే ఎమ్మెల్సి లుగా స్థానం కల్పించారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ ప్రతిభా భారతి కుమార్తె గా 2017లో టిడిపిలో చేరిన కావలి గ్రీష్మ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గా, రాజాం నియోజకవర్గం ఇన్చార్జిగా పనిచేశారు. 2022లో ఒంగోలులో జరిగిన మహానాడు వేదికపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని టార్గెట్ చేస్తూ గ్రీష్మ ఇచ్చిన స్పీచ్ టిడిపి క్యాడర్లో జోష్ నింపింది. అలాగే పార్టీ అధిష్టానం దృష్టిలో ఫైర్ బ్రాండ్ గా ఒక గుర్తింపుని తీసుకొచ్చింది. "మిస్టర్ సీయం " అంటూ జగన్ పై ఆమె విరుచుకుపడిన తీరు ఆమెను ఒక లీడర్ గా చాలామంది దృష్టిలో పడేలా పడేలా చేసింది. పార్టీ అధికారంలోకి రాగానే ఆమెకు కీలక పదవి గ్యారెంటీ అని అందరూ భావించారు. ఫైర్ బ్రాండ్ ఇమేజ్ కి తోడు మహిళా, దళిత అనే అంశాలు కూడా దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు ఎమ్మెల్సీ స్థానాన్ని గ్రీష్మ కు కేటాయించారు. బెందుల తిరుమల నాయుడు అలియాస్ బీటీ నాయుడు ఉమ్మడి కర్నూలు జిల్లాకు జుమల దిన్నె గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు. 1994లో టిడిపిలో చేరిన బీటీ నాయుడు 1996 నుండి మూడు సార్లు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశాడు. కడప అనంతపురం పార్లమెంటు నియోజకవర్గాల ఇన్చార్జిగా పనిచేసిన నాయుడు 2009, 2014 ఎన్నికల్లో కర్నూలు నుండి లోక్ సభకు పోటీ చేసి ఓడిపోయాడు. అయినా పార్టీ కి ఆయన చేసిన సేవలను గుర్తించిన చంద్రబాబు 2019లో టిడిపి నుండి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. ఇప్పుడు మరోసారి దాన్ని కంటిన్యూ చేస్తూ శాసనమండలికి ఎంపిక చేశారు తొలిసారిగా ఛాన్స్ దక్కించుకున్నారు గ్రీష్మ. ఆమె తల్లి ప్రతిభాభారతి సీనియర్ నేత. 1983 నుంచి 1999 వరకు వరుసగా ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చారు. ఉమ్మడి ఏపీ శాసనసభ మహిళా స్పీకర్ గా గుర్తింపు దక్కించుకున్నారు. అయితే ఆమె 2004, 2009, 2014లో ఓడిపోతూ వచ్చారు. అందుకే చంద్రబాబు 2019, 2024 ఎన్నికల్లో ప్రతిభా భారతికి ఛాన్స్ ఇవ్వలేదు. అయితే తన బదులు కుమార్తె గ్రీష్మకు అవకాశం కల్పించాలని ఆమె చాలాసార్లు కోరారు. ఇప్పుడు ఎమ్మెల్సీ రూపంలో అవకాశం కల్పించారు చంద్రబాబు.2019లో వైసీపీఅధికారంలోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీ నేతలపై విరుచుకుపడేది. ఆ సమయంలోనే టిడిపి మహానాడు తో పార్టీ శ్రేణులు యాక్టివ్ అయ్యాయి. ప్రకాశం జిల్లాలో ఏర్పాటు చేసిన మహానాడు టిడిపి పరిస్థితిని మార్చింది. మహానాడు వేదికగా కావలి గ్రీష్మ ప్రసంగం ఆకట్టుకుంది. ఏకంగా ఆమె తొడగొట్టి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి సవాల్ చేశారు. మండలి లో అటువంటి ఫైర్ బ్రాండ్ మహిళా నేత ఉండాలని చంద్రబాబు భావించారు. అందుకే ఎమ్మెల్సీగా ఛాన్స్ ఇచ్చినట్లు తెలుస్తోంది..ఉమ్మడి నెల్లూరు జిల్లా ఇసుకపల్లె గ్రామానికి చెందిన బీద రవిచంద్ర యాదవ్ యాదవ్ కు బీసీ నాయకుడుగా మంచి గుర్తింపు ఉంది. నెల్లూరు జిల్లా టిడిపి అధ్యక్షుడిగా, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడిగా, ఆంధ్రప్రదేశ్ ఆక్వా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం రవి చంద్రకు ఉంది. 2015లో తొలిసారి ఎమ్మెల్సీ అయ్యారు. నెల్లూరు జిల్లాలో సోమిరెడ్డి,నారాయణ లాంటివారు ఉన్నా పార్టీ వ్యవహారాలు రవిచంద్రకే అప్పగించేవారు. ఆనం రామనారాయణ రెడ్డి పార్టీలో చేరాక మాత్రం వారిరువురి మధ్య అంతగా పొసగడం లేదన్న వార్తలు ఉన్నాయి. అయితే అటు చంద్రబాబు ఇటు లోకేష్ ఇద్దరికీ సన్నిహితుడు కావడం 1999 నుండి పార్టీని అంటి పెట్టుకుని ఉండడం బీద రవిచంద్ర కు కలిసి వచ్చింది. దానితో చంద్రబాబు పార్టీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీద రవిచంద్ర ను ఎంపిక చేశారు. ఈసారి మూడు స్థానాలను వెనుకబడిన బలహీన వర్గాలకే కేటాయించాలని చంద్రబాబు భావించడంతో దళిత బిసి వర్గాల నుండి అభ్యర్థులను ఎంపిక చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# యథేచ్ఛగా ఇసుకను తవ్వకాలు?

## పట్టించుకోని రెవిన్యూ అధికారులు..!

ములుగు,తెలంగాణ దిశ:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నీరు పేద కుటుంబాలకు ఇండ్ల కోసం వాగులోనుండి ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా రైతులకు మిర్చి కల్లాలకు గాని, నూతన ఇండ్లకు తోలుకోవచ్చని ఆదేశించింది. కొంతమంది దీనిని ఆసరాగా చేసుకుని యూనియన్ పేరుతో ఇష్టారాజ్యంగా పగలు రాత్రి అనే తేడా లేకుండా హనుమంతు వాగును తవ్వేస్తున్నారు.జిల్లాలోని కన్నాయిగూడెం మండలం బుట్టయిగూడెం గ్రామంలో కొద్దిరోజుల క్రితం ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్ల యూనియన్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. యూనియన్ ఉంటే ఇసుక పుష్కలంగా తవ్వుకోవచ్చని, అంతేకాకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఎవరైనా ప్రశ్నిస్తే మాకు యూనియన్ ఉందని అధ్యక్షుడు పేరు చెప్పి, విచ్చలవిడిగా రవాణా చేసుకోవచ్చనే దిశగా అక్రమార్కులు ఆలోచిస్తున్నారు. రెవెన్యూ అధికారుల సపోర్ట్ దండిగా ఉండడంతో రెచ్చిపోతున్న ఇసుక అక్రమార్కులు ఒక్క ఇసుక లోడ్ ట్రాక్టర్ కు



1200 రూపాయలు తీసుకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రెవిన్యూ అధికారుల కళ్ళముందే ఇంత జరుగుతున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ ఇసుక రవాణా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# చట్టసభలను చులకన చేయడం తగదు !

చట్టసభలకు ఎన్నికైన వారు..సభకు, ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా నడుచుకోవాలి. సభలో ప్రజల పక్షాన నిలబడాలి. హోదాతో సంబంధం లేకుండా నడుచు కునేలా చూసుకోవాలి. అయితే తెలుగు రాష్ట్రాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. ప్రతిపక్షహోదా కలిగిన బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ చట్టసభలకు రావడం లేదు. సభలో ప్రజాసమస్యలపై చర్చించడం లేదు. ప్రతిపక్ష హోదా ఉన్నా కూడా యాన సభకు రాకుండా మొహం చాటేస్తున్నారు. పదేళ్లపాటు సిఎంగా పని చేసిన కెసిఆర్ విపక్షానికి పరిమితం కావడంతో ఇక ప్రజలతో పనేం అన్న విధంగా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రభుత్వం బాగా పనిచేయడం లేదని, ఇక అంతు తేలుస్తానని బయటనుంచి మాట్లాడుతున్నారు. కానీ సభకు వచ్చి సమసయలను ప్రస్తావించడం, తన ప్రభుత్వ హయాంలో జరిగిన మంచిచెడులను చర్చించడం జరగడం లేదు. ఇది ఓ రకంగా ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. అలాంటప్పుడు జీతభత్యాలు తీసుకోరాదు. నిజానికి ప్రజాప్రతినిధులకు జీతభత్యాలు, పెన్షన్లపై చర్చించాలి. వారికి కోట్లాది రూపాయలు చెల్లించాల్సిన అవసరమేముందో తేల్చాలి. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బుతో వారు సుఖాలు అనుభవిస్తున్నారు. ఇకపోతే ఎ.పి అసెంబ్లీలో జగన్ మోహన్ రెడ్డికి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చే అంశం మీద ఆసక్తికర చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. ప్రతిపక్షహోదా ఇస్తే తప్ప సభకు రానని మూర్ఖంగా వాదించడం జగన్‌కే చెల్లింది. 11 సీట్లతో ప్రతిపక్ష హోదా రావాలంటే రాదు. దానికి సభా సంప్రదాయాలు, నియమాలు ఉన్నాయి. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా, గతంలో ఎంపిగా పనిచేసిన జగన్ చట్టాల గురించి తెలుసుకోకుండా సభకు రానని చెప్పడం ఎన్నుకున్న ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. ప్రతిపక్షహోదా ఉన్న కెసిఆర్ రావడం లేదు..విపక్ష హోదా లేదు కనుక రాను పో అని జగన్ అంటున్నారు. ఇలాంటి నేతలను నమ్ముకుంటే ప్రజలు నట్టేట మునగడం ఖాయం. జగన్‌కి ప్రతిపక్ష హోదా ఇవ్వాలా వద్దా అనేది రాజకీయ నిర్ణయం కాదు. ఈ విషయంలో పార్లమెంటరీ సంప్రదాయాలు ఏం చెబుతున్నాయో పరిశీలించాలి. పార్లమెంటులో లేదా, అసెంబ్లీలో రాజకీయ పార్టీగా గుర్తింపు పొందాలంటే కొన్ని నిబంధనలు పాటించాలి. రాజకీయ పార్టీగా గుర్తింపు పొందితే, ఆ పార్టీ పార్లమెంటు లేదా అసెంబ్లీ ప్రాంగణంలో కొన్ని వసతులు పొందడానికి వీలుంటుంది. ఇటువంటి గుర్తింపు సభాపతి నుంచి వస్తుంది. ఎన్నికల సంఘం దగ్గర రాజకీయ పార్టీగా నమోదు చేసుకొని ఎన్నికల్లో పోటీ చేస్తాయి రాజకీయ పార్టీలు. అటువంటి పార్టీలకు చట్టసభలో ఒక సీట్ వున్నా అవి పార్లమెంటులో రాజకీయ పార్టీలుగానే కొనసాగుతాయిగానీ సభాధ్యక్షుడి గుర్తింపు వుండదు. సభాధ్యక్షుడి గుర్తింపు పొందితేనే సభా ప్రాంగణంలో కార్యాలయానికి గది కేటాయింపు వంటి వసతుల కల్పనకు అవకాశం ఉంటుంది. స్పీకర్ ఆధ్వర్యంలో పనిచేసే బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశాలకు పిలుపు వస్తుంది. వసతుల కల్పనకు నిబంధనలు వేరుగా ఉంటాయి. దీనికి సంబంధించి పార్లమెంటులో మూడు నిబంధనలు పొందుపరిచారు. వాటినే అసెంబ్లీల్లో పాటిస్తున్నారు. కనీసం పదిశాతం సీట్లు పొందిన వారికే విపక్షపార్టీగా గుర్తింపు దక్కుతుంది. గత పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీకి విపక్షహోదా దక్కలేదు. అది కావాలని ఆ పార్టీ పట్టుబట్టలేదు. ఫలితంగా పది సంవత్సరాలు లోక్‌సభలో ప్రతిపక్ష నేత అన్న వ్యవస్థ లేకుండా గడిచింది. 2014లోనూ, 2019 లోనూ కాంగ్రెస్ పార్టీ అతి పెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉన్నప్పటికీ దానికి పదో వంతు సంఖ్యా బలం లేదు. పదో వంతు సంఖ్యా బలం లేనప్పుడు ప్రతిపక్ష గ్రూప్‌గా గుర్తిస్తారుగాని ప్రతిపక్ష పార్టీగా గుర్తించక పోవటం గతంలో కూడా జరిగింది. 1984లో ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన ఎన్నికల్లో లోక్‌సభలో అతి పెద్ద ప్రతిపక్షంగా ఏ జాతీయ పార్టీ నిలువలేదు. ప్రాతీయ పార్టీ అయిన తెలుగు దేశానికి ప్రతిపక్ష గ్రూప్ అన్న గుర్తింపు దక్కింది. అయితే చట్టంలో ప్రతిపక్ష నేతగా గుర్తింపు పొందాలంటే పదో వంతు సభ్యులుండాలన్న నిబంధన అన్నది సంప్రదాయంగా వస్తున్న నిబంధన మాత్రమే. 1977లో మొదటిసారి ప్రతిపక్ష నాయకుడు అనే వ్యవస్థ ఏర్పడింది చట్టం ద్వారా. అయితే 1977లో అప్పటి జనతా ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టం ప్రతిపక్ష నాయకుడిగా గుర్తింపునకు కనీస సభ్యుల సంఖ్యను సూచించలేదు. సభలో అధికారపార్టీని వ్యతిరేకించే పార్టీలలో ఎక్కువమంది సభ్యులుండే పార్టీనేతను ప్రతిపక్ష నేతగా సభాధ్యక్షులు గుర్తిస్తారని పేర్కొన్నది. సభలో అధికార పక్షాన్ని వ్యతిరేకించే ప్రతిపక్ష పార్టీలు సమాన సంఖ్యా బలం కలిగి వుంటే ఏ పార్టీ నేతను ప్రతిపక్ష నాయకుడుగా గుర్తించాలనేది ఆ యా పార్టీల స్థితిగతుల ఆధారంగా సభాధ్యక్షుడు నిర్ణయిస్తారు. ఆ విధంగా సభాధ్యక్షుడి గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతకు కొన్ని సదుపాయాలు కల్పిస్తారు. సభ లోపల వెలుపలా కూడా. జీత భత్యాలు, వాహనం, సహాయ సిబ్బంది, అధికారిక నివాసం మొదలైనవి వస్తాయి.. ప్రతిపక్ష నేతకు కాబినెట్ మంత్రి హోదా కల్పించటం ఒక సంప్రదాయంగా వస్తున్నది. అయితే ఇక్కడ ముఖ్యమైన అంశం ఏమిటంటే ఒక పార్టీకి చట్టసభలో గుర్తింపు పొందటానికి అవసరమైన సభ్యులే లేకపోతే, అలాంటి పార్టీ నాయకుడికి ప్రతిపక్ష హోదా ఇచ్చే ప్రసక్తే లేదనేది 2014లో నాటి లోక్‌సభ స్పీకర్ తేల్చేశారు. ఇది రాజకీయపరమైన నిర్ణయం. ఈ వాదన 2014లో తెర మీదకు వచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పదో వంతు సభ్యులు కూడా లేరు. కాంగ్రెస్ పార్టీ దానిమీద ఏమీ రాద్ధాంతం చెయ్యలేదు. సభా కార్యకలాపాలకు దూరంగానూ లేదు. ప్రతిపక్ష నాయకుడిని సంప్రదించవలసిన ప్రతి సందర్భంలోను అప్పుడు కాంగ్రెస్ పార్టీ లోక్‌సభాపక్ష నేత అధీర్ రంజన్ చౌదరిని ప్రభుత్వం సంప్రదించింది. రాజ్యాంగ బద్ధమైన పదవులకు నియామకాలు చేసే కమిటీలో ప్రతిపక్ష నేత కూడా సభ్యుడు. ఉదాహరణకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి నియామకం. అటువంటి నియామకాలప్పుడు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకున్నా నరేంద్ర మోడీ ప్రభుత్వం అధీర్ రంజన్ చౌదరిని సంప్రదించింది. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే ప్రతిపక్షనేత హోదా కావాలని జగన్ పట్టుబట్టడం అసమంజసం. తనకు దక్కదని తెలిసి కూడా ఆ హోదా కోసం ఆరాటపడటం హుందాతనం అనిపించు కోదు. సభలో మాట్లాడటానికి కేటాయించే సమయం రాజకీయ పక్ష సభ్యుల సంఖ్యాబలం మీద ఆధారపడి ఉంటుంది. మాట్లాడే హక్కు ప్రతి సభ్యుడికీ ఉంటుంది. ఎంతసేపు అనేది సభాపతి నిర్ణయం. ప్రతిపక్షనేత గనుక కచ్చితంగా ఇంత సమయం కేటాయించాలి అన్న నిబంధన ఏమీ లేదు. తనకు 40 శాతం ఓట్లు వేసిన ప్రజల పక్షాన పోరాడాల్సిన సమయంలో హోదా ఇవ్వలేదనే వంకతో అసెంబ్లీకి రాకపోవటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది కెసిఆర్, జగన్ ఇద్దరికీ వర్తిస్తుంది. సభకు ఎన్నికయ్యాక సమావేశాలకు హాజరు కావాల్సిందే. ప్రజల పక్షాన నిలబడాల్సిందే.

# మంత్రి శ్రీధర్ బాబు పై ఆరోపణలు చేస్తే సహించేది లేదు

**కమాన్ పూర్,తెలంగాణ దిశ:**రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుదెల శ్రీధర్ బాబు పై ఆరోపణలు చేస్తే సహించేది లేదని రామగిరి కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. రామగిరి మండలం లోని సెంటినరీ కాలనీ శ్రీపాద భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అలనాడు బి ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అక్రమ ఇసుక రవాణా వల్ల ఎంతో ప్రాణాల నష్టం జరిగిందని కాంగ్రెస్ నాయకుల అన్నారు. మిగులు బడ్జెట్ లో ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన ఘనత కెసిఆర్ దేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చే లిక్కర్ రెండు సంవత్సరాల పాలసీ ఉండగా 6 నెల ముందే టెండర్లు పిలిచి వాటికి వచ్చిన ఆదాయాన్ని మింగిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందని అన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడం కోసం ఆదాయ వనరులు గత ప్రభుత్వం చేసిన అప్పులు తీర్చుకుంటూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం జరుగుతుందని అన్నారు. అలాగే నష్టం వాటిల్లి నా కుటుంబాలకు శ్రీధర్ బాబు న్యాయం చేస్తారని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో యువజనకాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ఆ రెల్లి కొమురయ్య తులసిరామ్ గౌడ్ ,రామ్మూర్తి, గంట వెంకటరమణారెడ్డి తీగల సమ్మయ్య, మోత్కూరి అవినాష్, బండారి సదానందం, ఉ ట్ల గోపాల్ రెడ్డి ,బంకు మల్లేష్, పొన్నం సత్యనారాయణ ,తదితరులు పాల్గొన్నారు.

# రోజూ ఉదయం మొలకెత్తిన పెసలను తినాలి.. ఎందుకో తెలుసా..?



రోజూ ఉదయం మనం అనేక రకాల బ్రేక్‌ఫాస్ట్‌లను తింటుంటాం. ఇడ్లీ, దోశ, పూరీ ఇలా వెరైటీ టిఫిన్లను తింటాం. అయితే బ్రేక్‌ఫాస్ట్‌తోపాటు పలు ఆరోగ్యవంతమైన ఆహారాలను తినాల్సి ఉంటుంది. దీంతో మనం అధికంగా ప్రయోజనాలను పొందవచ్చు. రోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ఆరోగ్యవంతమైన ఆహారాలను తింటే పోషణ లభించడమే కాదు, శరీరానికి శక్తి అందుతుంది. దీంతో రోజంతా ఉత్సాహంగా, యాక్టివ్‌గా ఉంటారు. అలాగే రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. ఇక ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తో కలిపి తినాల్సిన ఆరోగ్యవంతమైన ఆహారాల్లో మొలకెత్తిన పెసలు కూడా ఒకటి. వీటినే మొలకలు అని కూడా అంటారు. వీటిని ఉదయం తింటే ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.


**పోషకాలు..:** రోజూ ఉదయం మొలకెత్తిన పెసలను తినడం వల్ల అనేక పోషకాలు లభిస్తాయి. ఈ పెసలను తింటే వృక్ష సంబంధమైన ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి కండరాల నిర్మాణానికి, మరమ్మత్తులకు ఎంతగానో దోహదపడతాయి. ఉదయం మొలకలను తినడం వల్ల రోజంతా ఉత్సాహంగా, యాక్టివ్‌గా ఉండవచ్చు. ఉత్తేజంగా పనిచేస్తారు. బద్ధకం లేకుండా ఉంటుంది. ఎంత పనిచేసినా అలసిపోరు. పెసలను తినడం వల్ల పలు ఎంజైమ్‌లు మన శరీరంలో ఉత్పత్తి అవుతాయి. ఇవి జీర్ణక్రియను మెరుగు పరుస్తాయి. దీంతో మన శరీరం పోషకాలను సరిగ్గా శోషించుకుంటుంది. దీని వల్ల మలబద్ధకం తగ్గుతుంది. రోజూ సుఖ విరేచనం కలుగుతుంది. పెసలను తింటే అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి కూడా బయట పడవచ్చు. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది.

**విటమిన్ సి..:** పెసలలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు. రోగాలు రాకుండా ఉంటాయి. పెసలలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నాశనం చేస్తాయి. దీంతో చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. ముఖం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తారు. పెసలలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. అందువల్ల బరువు నియంత్రణలో ఉండాలనుకునే వారు పెసలను ఆహారంలో భాగం చేసుకోవాలి. పెసలను రోజూ తినడం వల్ల బరువు తగ్గుతారు. అలాగే శరీరానికి కావల్సిన పోషకాలు లభిస్తాయి.

**కొలెస్ట్రాల్ స్థాయిలు..:** పెసలలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. పెసలలో ఉండే పొటాషియం కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. దీంతో రక్త సరఫరా నియంత్రణలోకి వస్తుంది. బీపీ తగ్గుతుంది. హృదయ సంబంధ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. మొలకెత్తిన పెసల గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. కనుక షుగర్ ఉన్నవారికి ఇవి బెస్ట్ ఆప్షన్ అని చెప్పవచ్చు. వీటిని తింటే షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. మధుమేహం ఉన్నవారు రోజూ మొలకలను తింటుంటే షుగర్ లెవల్స్‌ను కంట్రోల్ చేయవచ్చు. మొలకలను తినడం వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు పోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. దీంతో రోగాలు రాకుండా ఉంటాయి. ఇలా పెసలను మొలకెత్తించి తింటే అనేక లాభాలను పొందవచ్చు.

### మీ కండరాలు బలంగా ఉన్నాయా..

## అయితే మధుమేహం ముప్పు తప్పినట్టే!



న్యూఢిల్లీ: కండరాలు బలంగా ఉంటే, మధుమేహం ముప్పు 44 శాతం తగ్గుతుందని వెల్లడైంది. యూకే బయోబ్యాంక్ నుంచి 1.4 లక్షల మంది సమాచారాన్ని విశ్లేషించి హాంకాంగ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు ఈ విషయం తేల్చారు. మధుమేహం ముప్పు అధికంగా ఉన్నవారి కండరాలు బలంగా ఉంటే, మధుమేహం ముప్పు వృద్ధి చెందే అవకాశాలు తగ్గుతాయని చెప్పారు. ఈ అధ్యయన నివేదిక బయోమెడ్ సెంట్రల్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. హాంకాంగ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ యంగ్వన్ కిమ్ మాట్లాడుతూ, వారానికి రెండు రోజులు, 150-300 నిమిషాలపాటు కండరాల పటిష్టత కోసం కృషి చేయాలని తెలిపారు. కండరాల పటిష్టత ఓవరాల్ ఫిట్‌నెస్‌కు ముఖ్యమని చెప్పారు. నడి వయసు నుంచి వృద్ధాప్యం వరకు టైప్-2 మధుమేహం ముప్పును ఎదుర్కొనే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పరిశోధనలో తేలిందని ఆయన చెప్పారు.

# వంకాయలను తేలిగ్గా తీసుకుంటే ఎన్నో లాభాలను కోల్పోతారు..!




వంకాయలను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. ఇందులో అనేక రకాలు ఉంటాయి. పర్పుల్, తెలుపు,గ్రీన్ కలర్‌లలో వంకాయలు మనకు అందుబాటులో ఉన్నాయి. వంకాయలతో ఏ కూర చేసినా సరే ఎంతో రుచిగా ఉంటుంది. వంకాయలతో పచ్చడి, టమాటా కూర, వేపుడు ఎక్కువగా చేస్తుంటారు. వంకాయల్లో మన శరీరానికి ఉపయోగపడే అనేక పోషకాలు ఉంటాయి. 100 గ్రాముల వంకాయలను తినడం వల్ల సుమారుగా 17.8 గ్రాముల పిండి పదార్థాలు లభిస్తాయి. ప్రోటీన్లు 8 గ్రాములు, శాచురేటెడ్ కొవ్వులు 5.2 గ్రాములు, ఫైబర్ 4.9 గ్రాములు, కొవ్వు 27.5 గ్రాములు, కొలెస్ట్రాల్ 16 మిల్లీగ్రాములు, చక్కెరలు 11.4 గ్రాములు, ఐరన్ 6 మిల్లీగ్రాములు లభిస్తాయి. విటమిన్ ఎ అధికం..: వంకాయలను తింటే విటమిన్ ఎ అధికంగా లభిస్తుంది. అలాగే క్యాల్షియం, సోడియం, పొటాషియం కూడా అధిక మొత్తంలో పొందవచ్చు. ప్లీహం వాపులకు గురైన వారు వంకాయలను తింటే ఎంతో ఫలితం ఉంటుంది. పచ్చి వంకాయ పేస్టుకి చక్కెర కలిపి ఉదయం తినాలి. దీంతో కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు. వంకాయ, టమాటా కలిపి తింటే అజీర్తి తగ్గుతుంది. ఆకలి పెరుగుతుంది. వంకాయను తినడం వల్ల గ్యాస్, అసిడిటీ, కఫం వంటి సమస్యలు తగ్గుతాయి. వంకాయను ఉడకబెట్టి తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం కాస్త తింటే నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమితో బాధపడేవారికి ఇది మంచి ఔషధంగా పనిచేస్తుంది. సూప్ కూడా తాగవచ్చు..: వంకాయ సూప్‌ను కూడా తయారు చేసి తీసుకోవచ్చు. ఇందులో ఇంగువ, వెల్లుల్లి వేస్తే ఎంతో రుచిగా ఉంటుంది. ఈ సూప్‌ను తాగితే కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. షుగర్ ఉన్నవారు వంకాయలను తింటే డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. వంకాయల్లో ఉండే ఫైబర్ షుగర్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తుంది. కొన్ని ఆఫ్రికా దేశాల వారు వంకాయలను ఫిట్స్ తగ్గించేందుకు వాడుతారు. వంకాయల నుంచి రసం తీసి తయారు చేసిన ఆయింట్ మెంట్లు, టించర్లు పైల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. వంకాయలను పేదవారి ప్రోటీన్ ఫుడ్‌గా చెప్పవచ్చు. వంకాయలను తింటే ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీరానికి శక్తిని అందించడమే కాకుండా కండరాల నిర్మాణానికి దోహదం చేస్తాయి. వీరు తినకూడదు..: అల్సర్ సమస్య ఉన్నవారు వంకాయలను తినకూ డదు. గర్భిణీలు వంకాయలను తినడం మంచిది కాదు. తింటే అలర్జీలు వచ్చే ప్రమాదం ఉంటుంది. కొందరికి వంకాయ పడదు. దీన్ని తిన్న వెంటనేఅలర్జీలు వచ్చి శరీరందురద పెట్టే అవకాశంఉంది. చర్మ వ్యాధులు ఉన్నవారు కూడా వంకాయలకు దూరంగా ఉండాలి. వంకాయలను తినడం వల్ల ఆరోగ్యకరమైన ప్రయోజనాలుకలిగే మాటవాస్తవమే అయిన ప్పటికీ ఆయా సమస్యలు ఉన్నవారు మాత్రం వీటికి దూరంగా ఉండాలి. అలాగే ఆపరేషన్ చేయించుకోబోతున్న వారు, చేయించుకున్నవారు కూడా వంకాయలను తినకూడదు. గుండె జబ్బులు ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు మాత్రమే వంకాయలను తినాలి. వంకాయలను అతిగా తింటే వాతం చేస్తుంది. కాబట్టి వీటిని మోతాదులోనే తినాలి.

# క్షణాలో గుండె జబ్బుల నిర్ధారణ..

### హైదరాబాద్ బాలుడి అద్భుత ఆవిష్కరణ
### ఏఐ యాప్‌ను అభివృద్ధి చేసిన హైదరాబాద్ బాలుడు
### బైడెన్, ఒబామా ప్రశంసలు

న్యూఢిల్లీ, : వైద్యరంగంలో తెలుగు బాలుడు సిద్ధార్థ్ నంద్యాల ఓ అద్భుతాన్ని ఆవిష్కరించాడు. ప్రస్తుతం అమెరికాలోని డల్లాస్‌లో నివాసముంటున్న 14 ఏండ్ల సిద్ధార్థ్ తన ఆవిష్కరణతో ఇటు సాంకేతిక రంగాన్ని అటు వైద్య రంగాన్ని అబ్బురపరిచాడు. అతడు ఆవిష్కరించిన యాప్ కృత్రిమే మేధ (ఏఐ) సాయంతో మనిషి గుండె ఆరోగ్యాన్ని నిర్ధారిస్తున్నది. సర్కేడియన్ ఏఐగా పేరుపెట్టిన ఆ పరికరం ఏడు క్షణాలపాటు గుండెచప్పుడు విని, అది ఆరోగ్యంగా ఉన్నదా లేక వ్యాధి బారిన పడిందా అన్నది వెంటనే తేల్చేస్తున్నది.



దీంతో ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన ఏఐ ప్రొఫెషనల్‌గా సిద్ధార్థ్ రికార్డు సృష్టించాడు. అతడు ఆవిష్కరించిన పరికరంతో ఇప్పటికే వేలమందిని పరీక్షించగా, అమెరికా మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, జో బైడెన్‌ల నుంచి ప్రశంసా పత్రాలను కూడా అందుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన ఈ టీనేజర్ చిన్న వయసులోనే అమెరికా వలస వెళ్లాడు. 23వ సంవత్సరానికిగాను సిద్ధార్థ్‌ను ఇన్నోవేటర్ ఆఫ్‌ది ఇయర్‌గా ఫ్రిస్కో చాంబర్ ఆఫ్ కామర్స్ ఎంపిక చేసింది. అదే ఏడాది అమెరికా ప్రజాప్రతినిధుల సభ అతడికి గుర్తింపు సర్టిఫికెట్‌ను జారీచేసింది.

మీ గుండె మీతో మాట్లాడితే!: తన పరికరం పని విధానాన్ని సిద్ధార్థ్ వివరిస్తూ.. 'సర్కేడియన్ ఏఐ అనేది ఒక ఆటోమేటెడ్ పరికరం. ఇది ఏడు క్షణాలపాటు గుండె చప్పుడు విని సమగ్ర నివేదికను అందిస్తుంది. మీ గుండె ఆరోగ్యంగా ఉన్నదా లేక ఏమైనా సమస్యలున్నాయా అన్నది వెల్లడిస్తుంది' అని చెప్పాడు. 'మీ గుండె మీతో మాట్లాడితే ఎలా ఉంటుందో ఊహించండి. ఏఐ సహకారంతో పనిచేసే ఈ పరికరం మీ గుండె అంతర్దృష్టిని అందిస్తుంది' అని అన్నాడు. ఈ యాప్‌ను గుండె వద్ద ఏడు క్షణాల పాటు ఉంచితే అది 40 రకాల గుండె సంబంధిత వ్యాధులను పసిగడుతుంది అని తెలిపాడు. అమెరికాలో 15 వేల మందిని భారత్‌లో 700 మందినిని, గుంటూరు,విజయవాడ ప్రభుత్వ దవాఖానల్లో 992 మందిని పరీక్షించగా 19 మంది హృద్రోగులు ఉన్నట్టు వెల్లడైంది. ఆ తరువాత వీరికి టూ(2)డీ ఈకో, ఈసీజీ పరీక్షలు నిర్వహించగా సర్కేడియన్ పరికరం తేల్చింది

### ఘనంగా ఇస్లావత్ బాలాజీ నాయక్ జన్మదిన వేడుకలు

తిరుపతి : ట్రైబల్ అవేర్నెస్ పోరం రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ నాయక్ మరియు వారి కుమార్తె లోచిత జన్మదిన సందర్భంగా ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా తిరుపతి కపిల తీర్థం అలిపిరి రోడ్డులోని శ్రీ పద్మావతి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడమైనది. అనంతరం వారినీ పలువురు నాయకులు,మిత్రులు కేక్ కట్ చేసి ఘనంగా సన్మానం చేసి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రైబల్ అవేర్నెస్ పోరం రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ నాయక్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరంలో ఆనవాయితీ ప్రకారం ఈరోజు వృద్ధాశ్రమంలో జన్మదినం నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు,ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.




# రోజూ పచ్చి కొబ్బరిని తినడం అలవాటు చేసుకోండి..



పూజలు లేదా ఇతర శుభ కార్యాలు జరిగినప్పుడు హిందువులు కొబ్బరికాయలను కొడుతుంటారు. ఆ తరువాత వాటిని నైవేద్యంగా పెట్టి తమ కోరికలను నెరవేర్చమని కోరుకుంటారు. అలాగే చాలా మంది ఇలాంటి కార్యక్రమాలకు కొబ్బరికాయలను ఉపయోగించకపోయినా తరచూ వంటల్లో మాత్రం కొబ్బరిని వేస్తుంటారు. కొందరు పచ్చి కొబ్బరిని వంటల్లో వేస్తే కొందరు ఎండు కొబ్బరిని వేస్తారు. కొబ్బరి వేస్తే వంటలకు మంచి రుచి, వాసన వస్తాయి. అయితే ఆరోగ్యపరంగా కొబ్బరి మనకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. కొబ్బరిని రోజూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

జీర్ణ సమస్యలకు..: జీర్ణ సమస్యలతో బాధపడేవారికి కొబ్బరి ఔషధంగా పనిచేస్తుంది. రోజూ ఒక చిన్న పచ్చి కొబ్బరి ముక్కను కాస్త బెల్లంతో కలిపి రాత్రి పూట భోజనం చేసిన అనంతరం తింటుండాలి. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. మలబద్ధకం తగ్గుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతుంది. గ్యాస్ సమస్య నుంచి బయట పడవచ్చు. కొబ్బరిలో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. రోజూ కొబ్బరిని తినలేకపోతే రాత్రి పూట నిద్రకు ముందు ఒక టీస్పూన్ కొబ్బరి నూనెను సేవించవచ్చు. ఇది కూడా జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

వేడి తగ్గేందుకు..: విరేచనాలు అయినప్పుడు కొబ్బరిని తింటే ఆ సమస్య నుంచి బయట పడవచ్చు. జీర్ణాశయంలో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. కొబ్బరిలో పొటాషియం అధికంగా ఉంటుంది. ముఖ్యంగా పచ్చి కొబ్బరిలో ఇది కాస్త ఎక్కువగానే ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. రక్త ప్రసరణ సరిగ్గా అయ్యేలా చూస్తుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. పచ్చి కొబ్బరిని వేసవిలో తింటే శరీరం చల్లగా ఉంటుంది. శరీరంలోని వేడి పోతుంది. కొబ్బరి మన శరీరానికి చలువ చేస్తుంది. కాబట్టి పచ్చి కొబ్బరిని వేసవిలో తినాలి. దీంతో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. ఎండ దెబ్బ నుంచి సురక్షితంగా ఉండవచ్చు.

మూత్రాశయ సమస్యలకు..: వేసవిలో చెమట కాయలు అధికంగా అవుతుంటాయి. అలాగే కొందరికి విపరీతంగా చెమట వచ్చి శరీరం దుర్వాసనగా ఉంటుంది. అలాంటి వారు కొబ్బరిని తింటుంటే ఫలితం ఉంటుంది. లేదా కొబ్బరి నీళ్లను కాస్త నీటిలో వేసి కలిపి ఆ నీటితో స్నానం చేస్తున్నా సమస్యలు తగ్గుతాయి. పొట్టలో నులి పురుగుల సమస్య ఉన్నవారు రోజూ కొబ్బరిని తింటుంటే ఫలితం ఉంటుంది. జీర్ణాశయం శుభ్రంగా ఉంటుంది. మూత్రాశయ సమస్యలు ఉన్నవారు రోజూ కొబ్బరిని తింటున్నా లేదా కొబ్బరి నీళ్లను తాగుతున్నా ఆ సమస్య నుంచి బయట పడవచ్చు. కొబ్బరిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ పంగల్, యాంటీ వైరల్ గుణాలు మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లకు కారణం అయ్యే క్రిములను నిర్మూలిస్తాయి. దీంతో ఇన్‌ఫెక్షన్ తగ్గుతుంది. అలాగే కిడ్నీల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. కిడ్నీ స్టోన్స్ కరిగిపోతాయి. ఇలా కొబ్బరిని రోజూ తింటే అనేక లాభాలను పొందవచ్చు.

## పెరుగులో మేలు చేసే గుణాలు



తరుచుగా ఛాతిలో, కడుపులో మంటపుడుతూ ఉంటుంది. అలాంటప్పుడు చాలామంది కూల్‌డ్రింక్స్ లేదా కూలింగ్ వాటర్ తాగుతారు. వీటికన్నా పెరుగుతో చేసిన లస్సీగానీ, పెరుగు గానీ తింటే సమస్య తగ్గుతుంది. పెరుగులో శరీరానికి మేలు చేసే గుణాలు చాలా ఉన్నాయని ఆహార నిపుణులు చెబుతున్నారు.

ఆహారం తీసుకున్నా కడుపులో మంటగా ఉన్నప్పుడు రోజూ పరగడుపున ఒక కప్పు పెరుగు తింటే చాలా మంచిది. ప్రతిరోజూ పెరుగు తీసుకునే మహిళల్లో వెజైనల్ ఈస్ట్ ఇన్ఫెక్షన్లు వచ్చే చాన్స్ చాలా తక్కువని పరిశోధనలు చెబుతున్నాయి. పెరుగు శరీరంలో తేమ శాతం తగ్గిపోకుండా కాపాడుతుంది. అందుకే జీర్ణవ్యవస్థ పనితీరు బాగుంటుంది. పొట్టలో ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి. హైబీపీ కూడా అదుపులోకి వస్తుంది. పని వల్ల బాగా ఒత్తిడికి గురైనవారు పెరుగు తీసుకుంటే అలసట తీరుతుంది. మంచి నిద్రలోకి వెళ్లి మెదడుపై ఒత్తిడి తగ్గుతుంది. కాబట్టి రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా పెరుగు భాగం చేసుకోవాలి. పెరుగులో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకలకు, దంతాలకు మేలు చేస్తుంది. పెరుగులో ఫాస్ఫరస్ కూడా ఉంటుంది. ఇది క్యాల్షియంతో కలవడం వల్ల ఎముకలు స్ట్రాంగ్ గా ఉంటాయి. రోజూ పెరుగు తినడం వల్ల భవిష్యత్తులో కీళ్లనొప్పులు, ఆస్టియోపొరోసిస్ లాంటి సమస్యలు రాకుండా ఉంటాయి.

## భోజనం చేసేటప్పుడు నీళ్లను తాగాలా.. వద్దా....!

భోజనం చేసేటప్పుడు నీళ్లను తాగవద్దని కొందరు చెబుతుంటారు. నీళ్లను తాగడం వల్ల జీర్ణ రసాలు సరిగ్గా ఉత్పత్తి కావని, తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాదని, దీంతో అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయని అంటుంటారు. అయితే కొందరు మాత్రం భోజనం చేసేటప్పుడు నీళ్లను తాగితేనే మంచిదని, ఇది ఆహారంతో సరిగ్గా కలుస్తుందని, ఆహారం సులభంగా జీర్ణం అయ్యేందుకు నీళ్లు ఎంతగానో దోహదపడతాయని అంటుంటారు. అయితే వీటిలో ఏది నిజం, ఎవరు చెబుతున్నది అర్థం చేసుకోవాలి, దేన్ని పాటించాలి.. అని చాలా మంది కన్‌ఫ్యూజ్ అవుతుంటారు. అయితే ఈ విషయంలో డాక్టర్లు ఏమని సమాధానం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. **అర గ్లాసు చాలు..:** భోజనం చేసేటప్పుడు నీళ్లను తాగితేనే మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. దీంతో మనం తిన్న ఆహారం సులభంగా పేగుల్లో కదులుతుంది. దీని వల్ల ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. అలాగే మలబద్ధకం అన్నది ఉండదు. అయితే భోజనం చేసేటప్పుడు మరీ ఎక్కువ నీటిని తాగకూడదు. అర గ్లాసు నీళ్లను మాత్రమే తాగాలని అంటున్నారు. దీని వల్ల మనం తినే ఆహారం పేగుల్లో సులభంగా కదులుతుంది. అలాగే గొంతు పట్టేయకుండా ఉంటుంది. కాస్త నీటిని తాగితే ఫర్వాలేదు. జీర్ణాశయం అందుకు అనుగుణంగా ఆమ్లాలను ఉత్పత్తి చేస్తుంది. అయితే ఎక్కువ నీటిని మాత్రం తాగకూడదు. అలా చేస్తే కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలు వస్తాయి. **30 నిమిషాల ముందు..:** ఇక భోజనం చేయడానికి 30 నిమిషాల ముందు నీళ్లను తాగితే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల మనం తినే ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా గ్రహిస్తుంది.

# ధర్మవరంలో మద్యం దుకాణంపై దాడి

**ధర్మవరం,తెలంగాణ దిశ:**పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం సర్కిల్ వద్ద ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మద్యం దుకాణంపై అర్ధరాత్రి దాడి జరిగింది. ద్విచక్ర వాహనాల్లో వచ్చిన ఐదుగురు వ్యక్తులు వాచ్‌మెన్ వరదరాజులు వద్ద నుంచి దుకాణం తాళాలు లాక్కొని మద్యం సీసాలను పగులగొట్టారు. కంప్యూటర్ ధ్వంసం చేశారు. మద్యం టెండర్లలో నిర్వహించిన లాటరీలో 7వ నంబరు దుకాణం ధర్మవరానికి చెందిన వైకాపా నాయకుడు బాలిరెడ్డికి దక్కింది. బుధవారం దుకాణం ప్రారంభించేందుకు అనంతపురం డిపో నుంచి మందు సీసాలు తీసుకువచ్చి దుకాణంలో ఉంచారు. దుండగుల దాడిలో బీరుతోపాటు, వివిధ రకాల బ్రాండ్ల మద్యం సీసాలు పగిలిపోయాయి. సంఘటనా స్థలాన్ని ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి, ఎస్ఐ నాగరాజు పరిశీలించారు. వాచ్‌మెన్ నుంచి వివరాలు సేకరించారు. మద్యం దుకాణం ఇవ్వాలని కూటమి కొందరు నాయకులు గుడ్‌విల్‌కు అడిగారని, దుకాణం ప్రారంభించిన తర్వాత ఆలోచన చేద్దామని చెప్పినట్లు బాలిరెడ్డి పేర్కొన్నారు. రూ.10 లక్షల విలువైన సరకు తీసుకువచ్చి దుకాణంలో నిల్వ చేశానన్నారు. దాడిలో విలువైన మద్యం సీసాలు పగులగొట్టారని తెలిపారు. ఈ సరకును ఉదయం బాలిరెడ్డికి అధికారికంగా



అప్పగించాల్సి ఉంది. సరకు ఎక్సైజ్‌శాఖ ఆధీనంలోనే ఉన్న సమయంలో దాడి జరగడంతో ధర్మవరం ఎక్సైజ్ ఎస్ఐ ధర్మవరం 1వ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.1.35 లక్షల విలువైన మద్యం సీసాలు, రూ.20వేలు విలువైన కంప్యూటర్ ధ్వంసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గొట్లూరుకు చెందిన రహీమ్, మాబు, తిరుపాల్, ధర్మవరం రామ్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్, మంజునాథ్‌పై వివిధ సెక్షన్ల కింద 1వ పట్టణ ఎస్ఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేశారు. దాడిలో పాల్గొన్న ఐదుగురిని అరెస్టు చేశారు.

# నీళ్ల వ్యాపారానికి పంచాయతీ బోరు?



**యాడికి,తెలంగాణ దిశ:**యాడికి పంచాయతీకి చెందిన బోరుబావితో నీళ్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. దీనిపై అధికారులు, పాలకులు పట్టించుకోకపోవ డంతో యథేచ్ఛగా ట్యాంకర్ల ద్వారా రవాణా చేస్తూ జేబులు నింపుకొంటు న్నారు. గతంలో పట్టణంలోని ప్రజలు నీటికి కష్టాలు పడుతుండటంతో పంచాయతీ నిధులు వెచ్చించి మూడేళ్ల కిందట నాలుగు బోరుబావులు తవ్వించారు. ఇందులో ఒకటి ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉంది. ఇక్కడి బోరుబావి ద్వారా ప్రైవేటు వ్యక్తులు ట్రాక్టర్లు, ఆటోలు తెచ్చుకుని మోటారు వేసుకుని, ట్యాంకర్లల్లో నింపుకొంటున్నారు. ఇలా రోజూ 20 నుంచి 30 ట్రిప్పులకు పైగా తరలిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ట్రిప్పులను ఇళ్ల నిర్మాణాలకు, గృహ అవసరాలకు, చిరు హోటళ్ల, పెద్ద వ్యాపార సంస్థలకు విక్రయించి ప్రతి నెలా రూ.వేలల్లో వెనకేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న అక్రమార్కులు వైకాపా నాయకుల అండదండలతో ఇష్టారాజ్యంగా తమ పబ్బం గడుపుకొంటున్నారు. మరోవైపు పట్టణంలో కనీస అవసరాలకు నీరందక జనం ఇబ్బంది పడుతున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శివారు ప్రాంతాల వారు తాగునీటి సమస్యలతో అల్లాడుతున్నా పట్టించుకొనే నాథుడే కరవయ్యారు. ఏటా క్రమం తప్పకుండా పంచాయతీకి పన్నులు చెల్లిస్తున్నా.. నీటి వసతి విషయంలో నిర్లక్ష్యాన్ని జనం దుమ్మెత్తిపోస్తున్నారు. పంచాయతీ ఆదాయానికి మాత్రం గండి కొడుతూ, వారు మాత్రం జేబులు నింపుకొంటున్నారు.

అసలే గతప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ నిధులు రాకపోవడంతో పంచాయతీలు ఆర్థిక సుడిగుండంలో మునిగిపోయాయి. విద్యుత్తు శాఖకు రూ.కోట్లల్లో విద్యుత్తు బిల్లులు పంచాయతీలు చెల్లించాల్సి ఉండటంతో పలుచోట్ల అధికారులు కనెక్షన్లు కత్తిరించిన దాఖలాలు ఉన్నాయి. ఇక్కడ ఏకంగా పంచాయతీకి నయాపైసా చెల్లించకుండా నీటి చౌర్యం చేస్తుండటంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

# ఆలోచన అంకురం.. అతివలే సారథ్యం




**ఎస్కేయూ,తెలంగాణ దిశ:**విద్యార్థులు ఉద్యోగం కోసం అన్వేషించడం కాకుండా ఉద్యోగాలు కల్పించే దిశగా పలు రంగాల్లో మహిళల ఆలోచనా విధానం ఉంటోంది. అటల్ ఇంక్యుబేషన్ కేంద్రంలో అలా శిక్షణ పొందిన మహిళలూ తమ సత్తా చాటుతున్నారు. 2018లో ఏర్పడిన ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం 900 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ఆలోచనల్ని సేకరించింది. అందులో 40 శాతం ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ఉండటం విశేషం. వీరంతా ఎస్కేయూ- ఏఐసీలోని నిపుణుల శిక్షణ, సూచనలు, సలహాలు, సహకారంతో స్టార్టప్‌లు ఏర్పాటు చేసుకున్నారు. అలా మహిళలు ఏర్పాటు చేసిన కొన్ని స్టార్టప్‌లకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు దక్కాయి. అంకుర సంస్థలు ఒకప్పుడు నగరాలకే పరిమితమయ్యేవి. ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించింది. గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలు, రైతాంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించే దిశగా సాంకేతిక పరిజ్ఞానంతో ఇన్నోవేషన్స్, స్టార్టప్‌ల స్థాపనకు కృషి చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందిన స్టార్టప్ ఇవే..

అంకుర సంస్థ పనితీరు : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఇది. రోగులు తీయించుకున్న ఎక్స్‌రే, స్కానింగ్ పిక్చర్లను జోడించాలి. రేడియాలజిస్ట్ రాసే రాతలు, చెప్పే భాష చాలా మందికి అర్థం కాదు. ఈ సాఫ్ట్‌వేర్ ఆధారంగా ఆ వివరా లు సులువుగా అర్థమయ్యేలా నివేదిక అందిస్తుంది. ఎస్కేయూ సమీపంలో దీన్ని వినియోగిస్తున్నాం. చిన్నచిన్న పట్టణాల్లో వైద్యులు కూడా గుర్తించని వ్యాధుల వివరాలను సాఫ్ట్‌వేర్ గుర్తిస్తుంది. యూకే నుంచి వచ్చిన ఎక్స్‌రే, స్కానింగ్ నివేదికల రూపకల్పనకు తోడ్పాటు అందిస్తున్నాం. కొన్ని సంవత్సరాల్లో దీన్ని ఆసుపత్రుల్లో ఉపయోగించేలా కృషి చేస్తాం

# ఆరోగ్యశ్రీలో అక్రమాలు..? విచారణలో తేలు!

**కోట,తెలంగాణ దిశ:**ఆరోగ్యశ్రీ అక్రమాల నిగ్గు తేల్చేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. శస్త్ర చికిత్సల ముందు నిర్వహించే వ్యాధి నిర్ధారణ పరీక్షల ఫీజుల వసూళ్లు, నాణ్యమైన పరికరాల ఏర్పాటు పేరుతో అద నంగా గుంజుడు, తదితర సమస్యలపై రోగుల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిశీలించింది. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో ట్రస్టు నిఘా బృందాలు విచారి స్తున్నాయి. యాజమాన్యాలకు తాఖీదులిచ్చి.. సంజాయిషీ కోరుతూ కఠిన చర్యలు తీసుకొంటున్నాయి. ఆరోగ్యశ్రీ డెస్కుల నుంచి ఓపీ తీసుకెళ్లిన రోగుల వ్యాధి నిర్ధారణ కోసం ముందే రూ.6 వేలు నుంచి రూ.10 వేల వరకు రక్త, మూత్ర, ఎక్స్‌రే, ఈసీజీ వంటి అనేక పరీక్షలు చేయిస్తున్నారు. ఇలా ఫీజుల రూపంలో గుంజిన తర్వాత వ్యాధి నిర్ధారణ అయినా వాటిని తిరిగి ఇచ్చే పరిస్థితి చాలా చోట్ల లేదు. దీంతో రోగులు ఆర్థికంగా కుంగిపోతున్నారు. తదుపరి ఏదైనా పరికరాలు అమర్చాల్సి వస్తే ఇవి నాణ్యత తక్కువని రూ.50 వేలు లేదా రూ.లక్ష వెచ్చిస్తే మంచి పరికరంతో శస్త్ర చికిత్స చేస్తామని నమ్మబ లుకుతున్నారు. ఇలా రోగి నుంచి సరాసరి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు గుంజుతు



న్నారు. ఇది తిరుపతి నగరంలోని ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో జరుగుతున్నట్లు బయటపడుతోంది. 104 ద్వారా 28 ఎనిమిది ఆసుపత్రులపై ఇటీవల 181 ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై తాజాగా కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్షించారు. ఇలాం టివి పునరా వృతం కాకుండా చూడాలని కాదంటే ఉపేక్షించేది లేదని ఎన్టీఆర్ వైద్యసేవ బృందాలను హెచ్చరించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ డెస్కుల మిత్రలపై నిఘా పెట్టారు. వీరి కనుసన్నల్లో గతంలో అనేక పొరపాట్లు జరిగినట్లు గుర్తించారు.

# ఉన్నా ఉపయోగం లేదాయె?

**హిందూపురం,తెలంగాణ దిశ:**రైతులు పండించిన కూరగాయలు నేరుగా వినియోగదారులకు విక్రయించి ఆదాయం పొందడం.. వినియోగదారులకు తాజా, చౌకగా అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో గతంలో తెదేపా ప్రభుత్వం రైతుబజార్లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా అనంతపురం, హిందూపురంలో రైతుబజార్లను నిర్మించింది. అప్పట్లో రైతులు, వినియోగదారులతో కళకళలాడేవి. ముఖ్యమంత్రులుగా పనిచేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి హయాంలో రైతుబజార్లు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. కనీసం రైతులు అటువైపు రాకుండా చేశారు. దళారులను ప్రోత్సహించే పరిస్థితికి తీసుకొచ్చారు. అన్నదాత చితికిపోయేలా చేశారు. ఈక్రమంలో కమీషన్లు, తరుగు పేరుతో పెద్దఎత్తున వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారు. పచ్చి సరకు పేరిట 10 శాతం కమీషన్, 10 శాతం తరుగుతో దోపిడీకి పాల్పడుతున్నారు. తూకాల్లోనూ మోసం చేస్తున్నారు. ఇంత చేస్తున్నా మార్కెటింగ్, తూనికలు, కొలతలు శాఖ అధికారులు ఏమీ పట్టనట్టుగా ఉన్నారు. అనంతపురం పాతూరు కూరగాయల మార్కెట్ తీరు ఇది. నిత్యం అపరిశుభ్రంగా ఉంటుంది. వానొస్తే అడుగువేయలేని దుస్థితి. ఆ ప్రాంతం అంతా ఇరుకుగా ఉంటుంది. ఇక్కడ మండీ వ్యాపారులు రైతుల నుంచి వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తారు. కమీషన్, తరుగు పేరుతో రైతును నిలువునా మోసం చేస్తున్నారు. ఇక్కడ వ్యాపారులే ఒకో చోట ఒక్కో ధరతో వినియోగదారులకు విక్రయిస్తుంటారు. అనంత నగరంలోని లలిత కళాపరిషత్తు వద్ద గత తెదేపా ప్రభుత్వ హయాంలో రైతుబజారును ఏర్పాటు చేశారు. మొత్తం 32 స్టాల్స్, 20 దుకాణాలు.. డిజిటల్ ధరల బోర్డు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం ఉంది. ఎస్టేట్ అధికారితో పాటు 4 నుంచి 5 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. అన్ని వసతులు ఉన్నా పూర్తి స్థాయిలో వినియోగంలో లేదు. బయట వ్యక్తులు ఉదయం, సాయంత్రం వేళ్లలో కాలక్షేపం చేస్తుంటారు. హిందూపురంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ మార్గంలో రూపుకోల్పోయిన రైతుబజారు ఇది. గత తెదేపా



హయాంలో నిర్మించారు. ప్రస్తుతం వినియోగంలో లేకపోవడంతో స్థానికులకు పశువుల షెడ్డుగా మారిపోవడం గమనార్హం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత తెదేపా సర్కారు హయాంలో గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, ధర్మవరం పట్టణాల్లో రైతుబజార్లు నిర్మించాలని జిల్లా మార్కెటింగ్‌శాఖ ప్రతిపాదించింది. గుంతకల్లులో నిర్మాణాలు చేపట్టినా అసంపూర్తిగా ఉంది. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో ఒకటి చొప్పున రైతుబజారు నిర్మించాలని మళ్లీ మార్కెటింగ్‌శాఖ ప్రతిపాదనలు పంపినా కార్యరూపం దాల్చలేదు. వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఈక్రమంలో తెదేపా కూటమి సర్కారు అధికారంలోకి వచ్చింది. ప్రతి మున్సిపాలిటీలో రైతుబజారు అందుబాటులోకి తెచ్చి.. వాటిని సక్రమంగా నిర్వహిస్తే రైతులు, వినియోగదారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. రైతుబజారుకు కనీసం 25 సెంట్ల స్థలం అవసరం. పట్టణాల్లో స్థలాలు దొరకడం లేదు. ఆయా మున్సిపాలిటీల్లో తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లకు విజ్ఞాపనలు అందజేశాం. గుంతకల్లులో రైతుబజారు పూర్తి చేయడానికి రూ.10 లక్షలు అవసరం. అనంతపురంలో మరోచోట రైతుబజారును నిర్మించాల్సి ఉంది.

# మెడికల్ కళాశాల కోసం ప్రణాళిక విద్యార్థి యువజన సంఘాల నాయకులు



**ఆదోని,తెలంగాణ దిశ:**ఆదోనిలో ప్రభుత్వ వైద్య కళాశాలను తక్షణమే నిర్మించి, తరగతులు ప్రారంభించాలని విద్యార్థి యువజన సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి యువజన సంఘాల నాయకులు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సాబీర్ భాష, పిడిఎస్‌యు, జిల్లా అధ్యక్షుడు అఖండ, పిడిఎస్‌యు, జిల్లా కోశాధికారి సోమశేఖర్, డిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదరు, బిడిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీన రమేష్, ఎన్ఎస్‌యుఐ డివిజన్ అధ్యక్షులు బాలు, డివైఎఫ్ఐ నాయకులు గోవిందరాజులు మాట్లాడారు అభివఅద్ధి లో వెనుకబడ్డ ఈ ప్రాంతంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడంతో అందరూ హర్షించామన్నారు ప్రభుత్వాలు మారడంతో కళాశాలకు గ్రహణం ఏర్పడడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఆదోనిలో అర్థాంతరంగా నిలిచిపోయిన మెడికల్ కళాశాలను పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు అర్ధంతగా మెడికల్ కళాశాల పనులు ఆగిపోవడం, ఈ సంవత్సరం నుంచి ప్రారంభం కావాల్సిన వైద్య విద్య తరగతులు ఆగివపోవడం ఆదోని ప్రజానీకం, విద్యార్థులు అందరూ చాలా తీవ్ర మైన బాధకి గురి చేసిన ఘటనగా భావిస్తున్నామ న్నారు. ఆదోని లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభిస్తే చుట్టూ పక్కల ప్రజానీకం కు మంచి వైద్యం అందుబాటులోకి రావడం తో పాటు వైద్య విద్యా ఆదోని రెవిన్యూ డివిజన్ లోని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అందుతుందన్నారు. కేంద్రంతో సంప్రదించి 5 కళాశాలలకు అనుమతులు తీసుకురావల్సిన ప్రభుత్వం పులివెందులకు వచ్చిన 50 సీట్లు కూడా వసతులు కల్పించలేమని రాష్ట్ర ప్రభుత్వమే ఎన్ఎంసికి లేఖ రాయడం ఏమిటని ప్రశ్నించారు. ఒక్క పాడేరుకే 50 సీట్లు వచ్చాయని, మిగిలిన 4 కళాశాలలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఓపి ఇచ్చి ఉంటే అనుమతులు లభించి ఉండేవని అభిప్రాయపడ్డారు. 700 సీట్లు ప్రభుత్వ నిర్లక్ష్యపు చర్య వలన కోల్పోయాం అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది కేవలం వైద్య విద్యను ప్రయివేటీకరణ చేయాలనే దుర్మార్గపు అలోచల నుండి చేస్తున్న చర్యగా భావిస్తున్నామని తెలిపారు. ప్రయివేటీకరణ జరిగితే ఎంతో మంది పేద , మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం కావలసిన పరిస్థితి వస్తుందన్నారు. వెనకబడిన తరగతుల విద్యార్థులకు నష్టం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో ఉచిత వైద్య సేవలు కూడా పేద ప్రజలకు అందవని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ ప్రాంత ప్రజలను మేలుకొలుపు మెడికల్ కళాశాలను సాధించుకునే దిశగా ఉద్యమ ప్రణాళిక రచిస్తామన్నారు పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు రాజకీయ పార్టీల నాయకులు సంఘాల నాయకులు తాము నిర్వహించే ఉద్యమానికి కలిసి రావాలని వ్యక్తం చేశారు.

# ప్రధాన నగరాల్లో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు..



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మరీ ముఖ్యంగాదేశ రాజధాని దిల్లీలో ప్రజలు చాలా కాలంగా రద్దీ రోడ్లతో ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా ఇప్పటివరకు పెద్దగా పరిష్కారం దక్కలేదు. ఈ నేపథ్యంలో దిల్లీ ప్రభుత్వం 'ట్యాక్స్' ఆలోచనతో ముందుకొచ్చింది. ఈ 'దిల్లీ కంజెషన్ ట్యాక్స్' ప్రకారం.. రద్దీ సమయంలో, ఎంపిక చేసిన రోడ్డు మీద మీరు ప్రయాణిస్తే అదనంగా- కొత్త ట్యాక్స్ కట్టాల్సి వస్తుంది! ఇలా చేస్తే, ట్రాఫిక్ తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. రద్దీ సమయాల్లో నిర్దేశిత రహదారులను ఉపయోగించినందుకు డ్రైవర్లకు ఛార్జీలు వసూలు చేసే వ్యూహాన్ని రూపొందిస్తున్నామని రవాణా శాఖ ప్రత్యేక కమిషనర్ షహజాద్ ఆలం తెలిపారు. రవాణా నిర్వహణకు కొత్త నిధుల కేటాయింపు జరుగుతోంది. మేము పనిచేస్తున్నదాన్ని 'రద్దీ ధర(కంజెషన్ ప్రైజింగ్)' అని పిలుస్తున్నాము," అని ఆలం చెప్పారు. ఇందుకోసం ప్రయోగాత్మకంగా దిల్లీ సరిహద్దుల్లోని 13 కీలక ప్రాంతాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టు చేపట్టారు. దిల్లీలో సదరు "రద్దీ పన్ను" ప్రతిపాదన కొత్త విషయం కాదు. 2018లో అప్పటి లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ తొలిసారి ఈ ప్రతిపాదన చేశారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ అధికంగా ఉండే రోడ్లపైకి ప్రవేశించే వాహనాలకు ఛార్జ్ వసూలు చేయాలని ఆయన ప్రతిపాదించారు. ట్రాఫిక్ని సులభతరం చేయడం, కాలుష్యాన్ని తగ్గించడం ఈ ప్రయోగం ముఖ్య లక్ష్యం.

నాడు.. ప్రభుత్వం నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు, ఈ విధానాన్ని అమలు చేయడానికి ముందు ప్రజల అభిప్రాయాన్ని కోరుతామని బైజల్ పేర్కొన్నారు. ఐటీఓ కూడలి, మెహ్రౌలి-గుర్గావ్ రోడ్డు సహా 21 హై ట్రాఫిక్ ప్రాంతాలను పన్నుకు అవకాశం ఉన్న ప్రాంతాలుగా ఆ సమయంలో దిల్లీ ప్రభుత్వం గుర్తించింది. 2017లో పార్లమెంటరీ కమిటీ కూడా రాజధానిలో రద్దీగా ఉండే ప్రాంతాలపై టోల్ విధించాలని సిఫార్సు చేసింది. బెంగళూరులో జనసాంద్రత ఎక్కువగా ఉండే రోడ్లపై ట్రాఫిక్ని తగ్గించడానికి 'రద్దీ పన్ను' విధించాలని అధికారులకు ఇటీవలే ఒక నివేదిక సూచించింది. కర్ణాటక దశాబ్దం -1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి రోడ్ మ్యాప్ అనే శీర్షికతో కర్ణాటక ప్రణాళికా విభాగం, పరిశ్రమ బృందం ఇచ్చిన నివేదిక, రద్దీ సమయాల్లో నగరంలోకి ప్రవేశించే మినహాయింపు లేని వాహనాల

నుంచి పన్ను వసూలు చేయడానికి ప్రస్తుత ఫాస్టాగ్ వ్యవస్థను ఆ నివేదిక ఉపయోగించాలని సూచించింది. ప్రజారవాణా ను మెరుగుపరచడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, జీవన నాణ్యతను పెంచడానికి ఈ ఆదాయాన్ని ఉపయోగించవచ్చని తెలిపింది.

సింగపూర్, లండన్, స్టాక్‌హోమ్ వంటి నగరాలు ట్రాఫిక్ని నిర్వహించడానికి, రద్దీని తగ్గించడానికి ఇలాంటి పన్నులను విజయవంతంగా అమలు చేశాయి. మరి ఈ కంజెషన్ ట్యాక్స్ మీద మీ ఒపీనియన్ ఏంటి? ఇది అమల్లోకి వస్తే ప్రజలపై మరింత భారం పడినట్టు అవుతుందా? లేక నిజంగానే ట్రాఫిక్ కంట్రోల్ అవుతుందా?

# ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా నిర్మాణాలు..?

**ముదిగుబ్బ,తెలంగాణ దిశ:**గత వైకాపా పాలనలో ప్రభుత్వ భూములను నాయకులు దర్జాగా కబ్జా చేశారు. వైకాపాకు చెందిన కొందరు నాయకులు ఆక్రమిం చిన భూముల్లో యథేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నారు. సర్కారు భూము లు అన్యాక్రాంతమవుతున్నాయని బాధితులు, స్థానికులు అనేకసార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు ఏమాత్రం పట్టిం చుకోవడంలేదు. గతంలో పనిచేసిన తహసీల్దార్లు వైకాపా నాయకులతో కుమ్మక్కై ఆక్రమణలకు పాల్పడ్డారు. దొరిగల్లు పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 1330-1లో మొత్తం 17.90 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో గుట్టపై వైకాపా నాయకులు చదునుచేసి.. ప్లాట్లుగా మార్చుకుని సెంటు రూ.2 లక్షల చొప్పున విక్రయించి సొమ్ము చేసుకు న్నారు. కస్తూర్బా పాఠశాల ఎదురుగా ఉన్న సర్వే నంబరు 826, 1190-3లో 2018లో పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల్లో వైకాపా నాయకుల నకిలీ పత్రాలు సృష్టించి 80 ప్లాట్లుకుపైగా ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. వడ్డేపేట సమీపంలో సర్వే నంబరు 896లో ఎకరం కొండపోరంబోకు భూమి ఉంది. జగనన్న ఇళ్ల పట్టాల పేరుతో అక్రమాలకు తెరలేపారు. వైకాపా నాయకులు ఇళ్ల స్థలాలు ఆక్రమించు కుని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించి భారీగా సొమ్ము



చేసుకున్నారు. 896-2లో ప్రభుత్వ భూమి కబ్జా చేసి పునాదులు తవ్వారు ప్రభుత్వ మారడంతో.. గతంలో పేదలకు ఇచ్చిన ఇళ్లపట్టాలు, ప్రభుత్వ భూము లను వైకాపాప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా అన్యాక్రాంతం చేశారు. ఆక్రమి ంచినభూములు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో అగ్రిమెంట్ ద్వారా ఇతరుల కు విక్రయించి రూ.లక్షల్లో సొమ్ము చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో బాధితులు స్పందిస్తున్నారు.

# బార్లీ గింజలతో నీళ్లను ఇలా తయారు చేసి తాగండి..

## చెప్పలేనన్ని లాభాలు కలుగుతాయి..!



ఆరోగ్యంగా ఉండేందుకు అందరూ రకరకాల మార్గాలను అనుసరిస్తున్నారు. ఆరోగ్యవంతమైన ఆహారం తినడంతోపాటు రోజూ యోగా లేదా వ్యాయామం చేయడం, వేళకు నిద్రపోవడం చేస్తున్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తే ఎలాంటి వ్యాధులు రాకుండా100ఏళ్లు జీవించవచ్చని చాలా మందికి అర్థం అవుతోంది. అందుకనే ఆరోగ్యకరమైన మార్గాల వైపు చూస్తున్నారు. అయితే శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకునేందుకు పలు రకాల ఆహారాలు కూడా ఎంతగానో దోహదపడతాయి. ముఖ్యంగా కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల మనకు అనేక విధాలుగా మేలు జరుగుతుంది.అయితే అలాంటి ఆహారాలు మనకు అందుబాటులోనే ఉన్నాయి. కానీ చాలా మందికి వాటి గురించి తెలియదు. వాటిల్లో బార్లీ గింజలు కూడా ముఖ్యమైనవే అని చెప్పవచ్చు.

**మలబద్దకం తగ్గుతుంది..:** బార్లీ గింజలు మనకు మార్కెట్‌లో లభిస్తాయి. వీటిని బీర్ తయారీకి ఉపయోగిస్తారని అందరికీ తెలిసిందే. అయితే బార్లీ గింజలను నీటిలో మరిగించి ఆ నీళ్లను రోజూ తాగుతుంటే ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు. బార్లీ గింజలను గుప్పెడు తీసుకుని 2 గ్లాసుల నీటిలో వేసి మరిగించాలి. అనంతరం ఈ నీళ్లను వడకట్టి ఒక గ్లాస్ మోతాదులో రోజూ ఉదయం, సాయంత్రం తాగాలి.రెండు సార్లు తాగలేమని అనుకునేవారు రోజుకు 1 గ్లాస్ తాగవచ్చు. బార్లీ గింజల నీళ్లు చప్పగా ఉంటాయి. కనుక రుచి కోసం ఆ నీటిలో తేనె, నిమ్మరసం వంటివి కలిపి కూడా తాగవచ్చు. ఇలా బార్లీ గింజల నీళ్లను తాగితే అనేక లాభాలను పొందవచ్చు. బార్లీ గింజల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్దకాన్ని తగ్గిస్తుంది. దీంతో రోజూ సుఖ విరేచనం అవుతుంది.

**హార్ట్ ఎటాక్ రాదు..:** బార్లీ గింజల నీళ్లను తాగడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. జీర్ణవ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. ఈ నీళ్లను రోజూ తాగడం వల్ల శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. దీంతో శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. ఇన్‌ఫెక్షన్లు రాకుండా అడ్డుకోవచ్చు. బార్లీ గింజల నీళ్లను సేవిస్తుంటే రక్తంలోని చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గిమంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. ఫలితంగా హార్ట్ ఎటాక్ రాకుండా కాపాడుకోవచ్చు.

అలాగే ఈ నీళ్లను సేవిస్తుండడం వల్ల షుగర్ లెవల్స్‌ను కూడా తగ్గించుకోవచ్చు. దీంతో డయాబెటిస్ అదుపులో ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారికి బార్లీ నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. రోజూ తాగితే ఎంతగానో ఫలితం ఉంటుంది.

**అధిక బరువు తగ్గుతారు..:** అధిక బరువు సమస్యతో బాధపడుతున్న వారికి బార్లీ నీళ్లు ఒక వరం అనే చెప్పవచ్చు. ఈ నీటిని సేవించడం వల్ల శరీరంలోని కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. శరీరంలోని వ్యర్థాలు బయటకు పోతాయి. కిడ్నీ స్టోన్స్ ఉన్నవారికి కూడా బార్లీ నీళ్లు ఎంతో అద్భుతంగా పనిచేస్తాయి. ఈ నీళ్లను రోజూ సేవిస్తుంటే కిడ్నీల్లోని రాళ్లు కరిగిపోతాయి.

డీహైడ్రేషన్ సమస్యకు బార్లీ గింజల నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయి. శరీరంలో ద్రవాలు ఎక్కువగా లేక తరచూ డీహైడ్రేషన్ బారిన పడేవారు రోజూ ఉదయం బార్లీ నీళ్లను తాగితే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఇలా బార్లీ గింజల నీళ్లను రోజూ తాగడం వల్ల అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. కనుక ఈ నీళ్లను రోజూ సేవించడం మరిచిపోకండి.




# పచ్చిగా తింటే..

కూరగాయల్లో ఎన్నోరకాల విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. అనేక వ్యాధులను దూరం చేస్తాయి. అయితే, కూరగాయలను ఉడికిస్తే.. వాటిలో పోషకాలు తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పచ్చిగానే తీసుకుంటే పోషకాలు పూర్తిస్థాయిలో శరీరానికి అందుతాయని అంటున్నారు. అయితే, ఇలా అన్నిరకాల పదార్థాలను పచ్చిగా తీసుకోవడం కూడా ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు.క్యారెట్ మాదిరిగా ముల్లంగిని పచ్చిగా తినకూడదు. ఇందులోని గాయిట్రోజెన్స్ అనే పదార్థం.. థైరాయిడ్ పనితీరుపై ప్రభావం చూపుతుంది. దీనిని నేరుగా తీసుకుంటే.. గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి. పాలకూరలో ఆగ్జలేట్ ఎక్కువ. ఇది కిడ్నీలో రాళ్లను ఏర్పరుస్తుంది. అతిగా తీసుకుంటే.. మలబద్ధకం ఇబ్బంది పెడుతుంది. కొన్ని కోడిగుడ్లలో సాల్మొనెల్లా అనే బ్యాక్టీరియా పెరుగుతుంది. వీటిని నేరుగా తీసుకోవడం వల్ల ఆహారం విషపూరితమయ్యే ప్రమాదం ఉంటుంది. ఫలితంగా.. కడుపునొప్పి, వాంతులతోపాటు జ్వరం లాంటి లక్షణాలు కనిపించవచ్చు. కాబట్టి, కోడిగుడ్లను సరైన ఉష్ణోగ్రత వద్ద ఉడికించి తినడమే మంచిది. కొన్నిసార్లు హాఫ్ బాయిల్డ్ కూడా అనారోగ్యాన్ని కలిగించవచ్చు. బీన్స్‌ను పచ్చిగా తీసుకుంటే.. కడుపులో హైడ్రోజెనిక్ యాసిడ్ ఉత్పత్తి అవుతుంది. ఫలితంగా.. వికారం, వాంతులు, విరేచనాలు ఇబ్బంది పెడతాయి. ఆలుగడ్డల్లో సొలానిన్ అనే టాక్సిన్ ఉంటుంది. ఇది నరాల సమస్యలు, వికారం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలను కలగజేస్తుంది. కాబట్టి, ఆలుగడ్డలను ఉడికించి తినడమే బెటర్! పచ్చిగా తినే అవకాశం ఉన్న కూరగాయలను కూడా ఎక్కువ మొత్తంలో తీసుకోవడం మంచిదికాదు. పరిమితికి మించి తీసుకుంటే.. కడుపు ఇన్ఫెక్షన్లు, అజీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఉడికించిన కూరగాయలతో పోలిస్తే.. పచ్చివి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. వీటిలోని పోషకాలను శరీరం నెమ్మదిగా గ్రహిస్తుంది. దాంతో జీర్ణక్రియ వేగం తగ్గుతుంది.

# డేటింగ్‌కు వెళ్తే క్యాష్ ప్రైజ్..

## ఉద్యోగులకు టెక్ కంపెనీ బంపరాఫర్

## చైనా కంపెనీ ఆఫర్



న్యూఢిల్లీ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒంటరి ఉద్యోగులు ఇటు వ్యక్తిగత జీవితాన్ని, అటు వృత్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోలేక నానా తిప్పలు పడుతున్నారు. మరీ ముఖ్యంగా జీవితంలోని ఆనందాన్ని అనుభవించలేకపోతున్నారు. ప్రపంచం అంతటా ఈ సమస్య ఉన్నట్టే చైనాలో కూడా ఉంది. విజయమే లక్ష్యంగా పనిచేస్తున్న ఉద్యోగులు వ్యక్తిగత జీవితాన్ని విస్మరిస్తుండటంతో చైనా కంపెనీ వినూత్న ఆలోచనతో ముందుకొచ్చింది. ఒంటరి ఉద్యోగులు డేటింగ్‌కు వెళ్తే నగదు ప్రోత్సహకాలు అందిస్తామని ప్రకటించింది. షెంజెన్‌కు చెందిన 'ఇన్‌స్టా360' అనే టెక్ కంపెనీ ఈ బంపరాఫర్ ప్రకటించింది. పార్ట్‌నర్‌ను పరిచయం చేస్తూ కంపెనీ డేటింగ్ ప్లాట్‌ఫాంపై పోస్టు పెడితే 66 యువాన్లు (దాదాపు రూ. 770) ఇస్తామని ప్రకటించింది. అంతేకాదు, ఆ బంధం విజయవంతంగా మూడు నెలలపాటు కొనసాగితే ఆ జంటతోపాటు వారిని కలిపిన వారికి 1,000 యువాన్లు (దాదాపు రూ. 11,650) ఇస్తామని తెలిపింది. ఉద్యోగుల జీవితాల్లో సంతోషం నింపడంతోపాటు మనది అనే భావన పెంపొందించేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు కంపెనీ తెలిపింది. ఈ ప్రోత్సాహకం ప్రారంభించిన తర్వాతి నుంచి ఇప్పటి వరకు 500 పోస్టులు వచ్చినట్టు పేర్కొంది. ఇందుకు గాను 10 వేల యువాన్ల (దాదాపు రూ. 1.16 లక్షలు) ప్రోత్సాహకాలు అందించినట్టు వివరించింది. కంపెనీ ప్రకటించిన ఈ సరికొత్త ప్రోత్సాహకాలపై ఓ ఉద్యోగి మాట్లాడుతూ తన విషయంలో తన తల్లి కంటే కంపెనీయే ఆసక్తిగా ఉందని చమత్కరించాడు.

# మనసారా నవ్వేద్దాం

పెదాలపై విరబూసే నవ్వు ఎదలోతుల్లోని ఆవేదనను దూరం చేస్తుంది. కళ్లలో కనిపించే నవ్వు.. మనసైన వారికి తెగ నచ్చేస్తుంది. ఎరుపెక్కిన బుగ్గలపై తుళ్లిపడే నవ్వు.. కోటి ఆశలను రేకెత్తిస్తుంది. నవ్వు నాలుగు విధాల చేటు అని అన్నవాళ్లు.. నవ్వడం రాని దురదృష్టవంతులు అంటారు పెద్దలు! కానీ, నిఖార్సైన నవ్వు నలభై రకాలుగా మేలు చేస్తుందని ఎన్నో అధ్యయనాలు కుండబద్దలు కొట్టాయి. ఏదైనా మాట్లాడే ముందు శ్రీరామచంద్రుడి మోములో చిరుదరహాసం వికసించేదట. నవ్వును మించిన భావ ప్రకటన లేదని అవతార పురుషుడు యుగాల కిందటే తేల్చిచెప్పాడు. ఆ విషయాన్నే నేటికీ ఎందరో పరిశోధకులు పరిపరి విధాలుగా అధ్యయనాలు చేసి నిరూపిస్తున్నారు కూడా! మందహాసమైనా.. వికటాట్టహాసమైనా.. నవ్వులు రువ్విన ప్రతిసారీ మానసిక ఒత్తిళ్లన్నీ దూరమైపోతాయి. మనం నవ్వినప్పుడే కాదు, ఎదుటివారి నిష్కల్మషమైన నవ్వును చూసినప్పుడూ.. మనసు తేలికపడుతుంది. మనసారా నవ్వినా, మనసైన వారి నగుమోము చూసినా.. శరీరంలో ఒత్తిడి కలిగించే హార్మోన్లు బలహీనమవుతాయని కొన్ని పరిశోధనల్లో తేలింది. అదే సమయంలో రోగ నిరోధక శక్తిని పెంచే కణాల సంఖ్య కూడా పెరుగుతుందని వెల్లడైంది. అంతేకాదండోయ్. కిలకిల నవ్వులు చిలికినపుడు.. శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలై నాడీ వ్యవస్థను చైతన్య పరుస్తాయట. రక్త ప్రసరణను కూడా ప్రభావితం చేసే శక్తి నవ్వుకు ఉంది. రక్తపోటు, గుండెకు సంబంధించిన సమస్యలు ఉన్నవారు.. నవ్వుతూ బతికితే ఆరోగ్యం మెరుగవుతుంది. అందుకే మనోవ్యాధులకే కాదు శారీరక రోగాలకూ 'లాఫ్టర్ థెరపీ' మంచి ఔషధం అంటారు వైద్యులు.



నవ్వు మంచిదని.. అసందర్భంగా నవ్వొద్దు. మయసభలో ద్రౌపది నవ్వు కురుక్షేత్ర సంగ్రామానికి నాంది పలికింది. నవ్వులపాలు కాకుండాఎన్ని నవ్వులు రువ్వినా వచ్చే ముప్పేం లేదు. ఒక్కో నవ్వుకు ఒక్కో అర్థం కూడా ఉందని శాస్త్రకారుల అభిప్రాయం. మోనాలిసా చిత్తరువులో మందహాసం వెనుక మతలబు కనుక్కోవడానికి గతంలో ఎన్నో పరిశోధనలు జరిగాయంటే ఆశ్చర్యం కలగకమానదు. ఏదేమైనా.. నవ్వుతూ బతకడంలో ఉన్న ఆనందం మరెందులోనూ లేదన్నది సత్యం. అందుకే మనసారా నవ్వండి.

# నాకొక గర్ల్‌ఫ్రెండ్ కావాలి!

స్విగ్గీ, జొమాటోల్లో.. బిర్యానీలు, పిజ్జాలు ఆర్డర్ ఇవ్వడం కామన్! గర్ల్‌ఫ్రెండ్స్, పెళ్లికూతురు కావాలంటూ రిక్వెస్ట్ పెట్టడమే వెరైటీ! గతేడాది ఇలాంటి వెరైటీలు ఎన్నో జరిగాయని చెబుతున్నది ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్.. జొమాటో! 2024లో 4,940 మంది.. తమకు 'గర్ల్‌ఫ్రెండ్'ను డెలివరీ చేయాలంటూ జొమాటోకు అభ్యర్థనలు పంపారట. మరో 40 మంది 'పెళ్లికూతురు' కోసం సెర్చ్ చేశారట. 2024 ముచ్చట్లను పంచుకుంటూ.. జొమాటో ఈ ఫన్నీ విషయాలనూ వెల్లడించింది. దేశంలో ఎన్నో మ్యాట్రిమోనీ సైట్లు, డేటింగ్ యాప్స్ ఉన్నా.. పెళ్లికూతుళ్లు, గర్ల్‌ఫ్రెండ్స్ కోసం ఫుడ్ డెలివరీ యాప్స్‌లో వెతకడంపై జొమాటో ఆశ్చర్యం వ్యక్తం చేసింది. 2024లో ఫుడ్ డెలివరీకి సంబంధించి ఢిల్లీ – జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్ ) అగ్రస్థానంలో నిలిచింది. దేశ రాజధాని ప్రాంతం నుంచి అత్యధికంగా 12.4కోట్ల ఆర్డర్లు అందుకున్నట్టు జొమాటో వెల్లడించింది. ఆ తర్వాత స్థానాలు ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, హర్యానా రాష్ట్రాలు దక్కించున్నాయట. ఈ ప్రాంతాల నుంచి 10.5 కోట్ల ఆర్డర్లు వచ్చాయట. ఇక బెంగళూరు నగరం 30 లక్షల ఆర్డర్లు ఇచ్చి, ముంబయిని వెనక్కి నెట్టింది. ఒకేరోజు అత్యధిక ఆర్డర్లను పొందింది.. మే 12. జొమాటో ఆ రోజు 34.8 లక్షల ఆర్డర్లను అందుకున్నదట. జనవరి 29న అత్యల్పంగా.. 16.8 లక్షల ఆర్డర్లు వచ్చాయని సదరు సంస్థ చెప్పింది. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. కేక్‌కు ఎక్కువ ఆర్డర్‌లు వచ్చింది డిసెంబర్ 25నో..



డిసెంబర్ 31నో కాదట. సెప్టెంబరు 22న వచ్చాయట. అందులోనూ.. 'అంబానీ పెళ్లి' అని సేవ్ చేసిన చిరునామాకు నాలుగు ఆర్డర్లు వచ్చాయట. బిర్యానీయే బాస్.. ఎప్పటిలాగే.. ఎక్కువ ఆర్డర్లు పొందిన ఆహార పదార్థంగా బిర్యానీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నది. 2024లో అత్యధికంగా 9కోట్ల 10 లక్షల మంది బిర్యానీని ఆర్డర్ చేశారట. ఆ తర్వాత 5 కోట్ల 80 లక్షల ఆర్డర్లతో పిజ్జా రెండో స్థానాన్ని దక్కించుకున్నది. ఇక భారతీయుల ఫేవరెట్ డ్రింక్స్ విషయానికి వస్తే.. టీ, కాఫీలే దక్కించుకున్నాయట. 77.7 లక్షల టీలు, 74.3 లక్షల కాఫీలను జొమాటో డెలివరీ చేసిందట.

# బాల్యం నుంచే బాధ్యతలు..



నేటితరం పిల్లలు.. 'స్మార్ట్'గా తయారవుతున్నారు. చదువుల్లో 'టాప్' ర్యాంక్‌ల్లో ఉంటున్నారు. అయితే, ఇల్లు స్కూలు తప్ప.. వేరే ఏదీ లేదన్నట్టుగా పెరుగుతున్నారు. చదువుల్లో ఫస్ట్ వస్తున్నా.. నలుగురిలో కలవలేక పోతున్నారు. బయటి ప్రపంచంలో అడుగుపెడితే.. బిత్తిరి చూపులు చూస్తున్నారు. వీరిలో కొందరు అతిగారాబం వల్ల ఇలా తయారైతే.. మరికొందరు 'స్మార్ట్ గ్యాడ్జెట్స్'తో స్మార్ట్‌లెస్‌గా మారుతున్నారు. ఇలా పెరిగే పిల్లలు.. భవిష్యత్తులో ప్రపంచంతో పోటీ పడలేరని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్ గురించిన విషయాలను వారికి బాల్యం నుంచే నేర్పించాలని సూచిస్తున్నారు. ముందుగా పిల్లల్లో సామాజిక విలువలను పెంచాలి. పెద్దవారిని గౌరవించడం నేర్పించాలి. ఇంట్లోవారే కాదు.. ముఖపరిచయం లేనివారికి కూడా గౌరవం ఇవ్వాలని చెప్పాలి. ముఖ్యంగా.. పేద–ధనిక వ్యత్యాసం చూపించకుండా పెంచాలి. అందరూ సమానమే అనే సత్యాన్ని వారికి ఉగ్గుపాలతోనే పట్టించాలి. ఆర్థిక అక్షరాస్యతపై బాల్యం నుంచే అవగాహన కల్పించాలి. డబ్బు విలువ కూడా తెలియాలి. వారికి నచ్చింది కదా! అనో.. మారాం చేస్తున్నారనో అడిగిన ప్రతి ఒక్కటీ కొనివ్వకూడదు. ప్రతి వస్తువుపైన ఉండే ధరలను వారితోనే చదివించాలి. ఆ వస్తువు విలువ.. దానిని కొనడం వల్ల కలిగే ప్రయోజనం ఎంత? తదితర విషయాల గురించి చర్చించాలి. ఆ వస్తువు సరైన విలువ తెలుసుకోవడం, బేరాలు ఆడటం, మార్కెటింగ్‌పైనా అవగాహన కల్పించాలి. బయటికి వెళ్లినప్పుడు ఎలాంటి పరిస్థితులు ఉంటాయో తెలియజేయాలి. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఎలా స్పందించాలో పిల్లలకూ నేర్పించాలి.ఆటలు ఆడుతున్నప్పుడో.. ఇంకేదో సందర్భంలోనో ఏదైనా ప్రమాదం జరిగి.. తోటి పిల్లలకు దెబ్బలు తగిలితే, ఎలా ప్రవర్తించాలో చెప్పాలి. వారికీ ఏదైనా అవసరం వచ్చినప్పుడు ఒంటరిగా ఆలోచించకుండా.. ఇతరుల సాయం తీసుకోవడం నేర్పాలి.ఇక ఇంట్లో.. ఎవరి దుస్తులు వారే జాగ్రత్త చేసుకోవడం నేర్పించాలి. తమ దుస్తులను ఉతకడానికి వాషింగ్ మెషిన్‌లో వేయడం మొదలుకొని.. ఆరేయడం, మడతపెట్టడం, అల్మారాలో సర్దుకోవడం దాకా ప్రతి పనిలోనూ వారి సహాయాన్ని తీసుకోవాలి. వంటగదిలోనూ.. కూరగాయలు తరగడం, గిన్నెలు శుభ్రం చేయడం నేర్పిస్తే.. కొన్నిరోజులకు వారి పనులు వారే చేసుకోగలరు.

# ప్రతి రోజూ ఇది తినండి.. వృద్ధాప్యం దరిచేరదు

మన ఆరోగ్యంపై మన ఆహారపు అలవాట్ల ప్రభావం ఎంతో కీలకంగా ఉంటుంది. ఆరోగ్యకరమైన ఆహారం మన శరీరం ఫిట్‌నెస్, చర్మ సౌందర్యానికి దోహదపడుతుంది. ముఖ్యంగా 30 ఏళ్లు దాటిన తర్వాత శరీరంలో జరుగే మార్పులను అదుపు చేయడం కోసం సరైన ఆహారపు అలవాట్లు అవసరం. ఈ వయసులో జీవక్రియ మందగించడం, కండరాల బలహీనత, కొవ్వు పేరుకుపోవడం మొదలైన సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఈ సమస్యలను తగ్గించడంలో ఆకు కూరగాయలు కీలకపాత్ర పోషిస్తాయి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు పుష్కలంగా ఉండటంతో గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. ముఖ్యంగా విటమిన్ సి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడంలో సహాయప డుతుంది. ఇది చర్మానికి మృదుత్వాన్ని, యవ్వనాన్ని అందిస్తుంది.



Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215